సాక్షి
నాగర్‌కర్నూల్

శుక్రవారం, 13, జనవరి, 2023



ముగిసిన శిక్షణ

జడ్చర్ల పట్టణంలో మహిళలకు ఇస్తున్న టై అండ్ డై శిక్షణ ముగిసింది.

వివరాలు IIలో ▸



ఆకట్టుకున్న రంగవల్లులు

సంక్రాంతిని పురస్కరించుకొని నిర్వహించిన ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి.

వివరాలు IIIలో ▸

గరిష్టం/కనిష్టం
31.6 /15.2

వాతావరణం

ఉదయం ఆకాశం మేఘావృతమై చల్లని గాలులు వీస్తాయి. మంచు కురుస్తుంది. ఉదయం, రాత్రివేళ చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సెమినార్‌లో పాల్గొనండి

కందనూలు: విజ్ఞానశాస్త్ర బోధనలో ఉపాధ్యాయులు నూతన పోకడల అన్వేషణ, సమర్థవంతంగా బోధించడం, ఆధునిక పద్ధతులను అవలంభించడం, విద్యార్థుల్లో పరిశోధనాత్మక నైపుణ్యాలను పెంచడానికి ఫిబ్రవరి 28న నిర్వహించే ఒకరోజు సెమినార్‌లో సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొనాలని డీఈఓ గోవిందరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా శాస్త్రీయ సంస్కృతిని ప్రోత్సహించడం, ఉప అంశాలుగా శాస్త్రీయ పురోగతికి పాఠశాల స్థాయిలో గల అవకాశాల అన్వేషణ, ప్రాచీన భారతం శాస్త్రీయ విజ్ఞానం- ప్రస్తుత కాలానికి గల సంబద్ధత, ఆత్మ నిర్భర్ భారత్‌లో శాస్త్రీయ విజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి పాత్ర, ఆసక్తిని రేకెత్తించడానికి ప్రాథమిక స్థాయి బోధనలో కళలు, క్రీడలను మిళితం చేయడం, శాస్త్రీయతను జీవన విధానంగా మార్చుకోవడం ఉంటాయన్నారు. ఉపాధ్యాయులు ఏదో ఒక అంశంపై నాలుగు పేజీలకు మించకుండా సెమినార్ పత్రాలను ఫిబ్రవరి 2లోగా పంపాలని, పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డిని సంప్రదించాలని సూచించారు.

పశువైద్య కేంద్రాల పరిశీలన

నాగర్‌కర్నూల్ రూరల్: మండలంలోని దేశిటిక్యాలలో ఏర్పాటు చేసిన పశువైద్య కేంద్రాన్ని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి రమేష్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన రైతులతో ఆయన మాట్లాడారు. రైతులు పాడి పరిశ్రమపై దృష్టిసారించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. పశుగ్రాసం కోసం ప్రభుత్వం గడ్డి విత్తనాలను సరఫరా చేస్తుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాల ఉత్పత్తులు అధికంగా పొందడానికి సరైన మందులు కూడా సరఫరా చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో ఇప్పటికే అధిక పశువైద్య కేంద్రాల్లో పునరుత్పత్తి ఏర్పాట్లు ఉన్నాయని, గోపాలమిత్రలకు సమాచారం ఇస్తే.. ఇంటికి వచ్చి వైద్యం అందిస్తారన్నారు. రైతులు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని వసతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సిబ్బంది పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ శ్రావణి, రైతులు పాల్గొన్నారు.

వివేకానందుడి విగ్రహ ఏర్పాటుకు కృషి



అచ్చంపేట: స్వామి వివేకానంద ఆశయాలను అనుసరించి పనిచేస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. గురువారం అచ్చంపేట ఆర్టీసీ బస్టాండు ముందున్న అమరవీరుల స్తూపం వద్ద స్వామి వివేకానంద విగ్రహ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అచ్చంపేటలో ఏర్పాటు చేయబోయే వివేకానందుడి విగ్రహ ఏర్పాటుకు రూ.5 లక్షల విరాళం ఇస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో ఉత్సవ గౌరవాధ్యక్షులు నర్సింహాగౌడ్, అధ్యక్షుడు బాలాజీ, వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు గౌరీశంకర్, ప్రధాన కార్యదర్శి శివాజీ, జిల్లా రైతుబంధు అధ్యక్షుడు మనోహర్, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు మంగ్యానాయక్, మాజీ ఎంపీపీ రామనాథం, గోపాల్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వరశర్మ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా.. సారా



అటవీ ప్రాంతంలో దాచిన నల్లబెల్లం బస్తాలను గుర్తించిన ఎక్సైజ్ పోలీసులు

సంక్రాంతి నేపథ్యంలో ఊపందుకున్న తయారీ, విక్రయాలు

- అడ్డుకట్ట వేయలేకపోయిన పునరావాస పథకం
- బైండోవర్ నిబంధనలు పాటించని ఉల్లంఘనులు
- కొత్తపంథాలో నిషేధిత నల్లబెల్లం, సారా సరఫరా
- టార్గెట్ల కోసమే అధికారులు పనిచేస్తున్నట్లు ఆరోపణలు



పత్తిలో దాచిన బెల్లం బస్తాలు బయటకు తీస్తున్న సిబ్బంది

అచ్చంపేట రూరల్: జిల్లాలో సారా ఏరులై పారుతుంది. మారుమూల తండాలు, పల్లెలు మొదలుకొని పట్టణాల్లోని శివారు ప్రాంతాల్లోనూ గుడుంబా ఘాటు గుప్పుమంటుంది. కట్టడి చేసేందుకు ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేస్తున్నా గుట్టుగా దందా నడిపిస్తూనే ఉన్నారు. తాగుడుకు బానిసై ఆర్థికంగా కుంగిపోయి చిందరవందరమైన కుటుంబాలు ఈ ప్రాంతంలో అనేకం ఉన్నాయి. అక్రమంగా తయారవుతున్న సారాను నియంత్రించాల్సిన అధికారులు నామమాత్రంగా దాడులు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సారా తయారవుతున్న తండాలు, గ్రామాల గురించి ఎక్సైజ్ అధికారులకు పూర్తి సమాచారం ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదు. ఎవరెవరు తయారు చేస్తున్నారు.. ఎక్కడెక్కడ విక్రయిస్తున్నారన్న విషయం పూర్తిగా తెలిసినా తెలియదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, నెల టార్గెట్‌ల కోసం కేసులు నమోదు చేస్తున్నారే.. తప్ప చిత్తశుద్ధితో పనిచేయడం లేదని వీరి పనితీరు బట్టి తెలుస్తోంది.

సారా తయారీ, నల్లబెల్లం సరఫరాను నియంత్రించడానికి జిల్లాలో ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేస్తూ నిరంతరం నిఘా పెడుతున్నారు. గతంలో పునరావాస పథ

నిబంధనలు బేఖాతర్

కంలో లబ్ధిదారులుగా ఉన్నప్పటికీ చాలామంది ఇదే దందాను కొనసాగిస్తున్నారు. బైండోవర్ కేసులు సైతం లెక్క చేయడం లేదు. పట్టుబడిన వారే మళ్లీ దొరికిపోతున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

కొన్నిరోజులే నివారణ..

సారానే జీవనోపాధిగా ఎంచుకున్న కుటుంబాలకు ప్రభుత్వం గతంలో పునరావాసం కల్పించేందుకు రాయితీతో స్వయం ఉపాధి పథకాలను మంజూరు చేసింది. ఒక్కొక్కరికి రూ.2 లక్షలు మంజూరు చేసింది. ఈ పథకం కొన్ని రోజులు మత్తు దందాను నివారించగలిగినా.. మళ్లీ సారా తయారీ, విక్రయాలవైపే వారు మొగ్గుచూపుతున్నారు. తక్కువ పెట్టుబడితో పెద్దఎత్తున డబ్బులు వస్తుండటంతో తిరిగి బట్టీలు నిర్వహిస్తున్నారు. దీనికితోడు ఉపాధి యూనిట్ల ఎంపికలో లోపాల కారణంగా పునరావాస పథకాలు వారిని ఆకట్టుకోలేకపోయాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కొత్త పంథాలో...

సారా బట్టీల ఏర్పాటుకు అడవులు, పంట పొలాల సమీపంలో, కేఎల్‌ఐ కాల్వలను అడ్డాలుగా మార్చుకుంటున్నారు. ఎవరి కంట పడకుండా గుట్టుగా సారాను తయారీ చేస్తున్నారు. అలాగే సారా వ్యాపారాన్ని అడ్డుకట్ట వేయడానికి ఎక్సైజ్ అధికారుల వశం కావడం లేదు. ఎన్ని ప్రత్యేక బృందాలు ఉన్నప్పటికీ నల్లబెల్లం అక్రమ రవాణాను అడ్డుకోలేకపోతోంది. కొందరు నల్లబెల్లం సరఫరాకు విలువైన కార్లను ఉపయోగిస్తున్నారు. కల్వకుర్తి సమీపంలోని వెల్దండలో అంబులెన్స్‌లో నల్లబెల్లం తరలిస్తుండగా పట్టుబడిన సంగతి తెలిసిందే. నల్లబెల్లాన్ని పొడి రూపంలోనూ సరఫరా చేస్తున్నారు. హైదరాబాద్, ఇతర ప్రాంతాల నుంచి నల్లబెల్లం సరఫరా చేయగా శ్మశాన వాటికలు, గడ్డివాములు, పాడుబడిన బావులు, పాత ఇళ్లు, కేఎల్‌ఐ కాల్వలు, పంట పొలాల్లో గుంతలు తీసి దాచి పెడుతున్నారు. సారా సరఫరాలోనూ నూతన ఒరవడికి శ్రీకారం చుడుతున్నారు. ఎవరూ గుర్తు పట్టకుండా బైక్‌లపై కుటుంబ సభ్యులు వెళ్లినట్లు కాలేజీ, క్యారీ బ్యాగుల్లో సారాను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలిస్తున్నారు. గ్రామాల్లోనూ గల్లీగల్లీకి సారాను విక్రయిస్తున్నారు. కిరాణ దుకాణాలు, చిన్నపాటి హోటళ్లు, ఇళ్లలో సారా విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

దాడులు చేస్తున్నాం..



ప్రత్యేక బృందాలతో ప్రతిరోజు దాడులు సారా తయారీ స్థావరాలపై దాడులు జరుపుతున్నాం. నిందితులను బైండోవర్ చేస్తున్నాం. నిబంధనలు అతిక్రమించిన వారిపై పీడీయాక్టు నమోదు చేస్తాం. నల్లబెల్లం సరఫరా చేసే వారిపై నిఘా ఉంచాం. కందనూలును గుడుంబా రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలి.

– ఫయాజుద్దీన్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్

జిల్లాలో గతేడాది నమోదైన కేసులు ఇలా..	నమోదైన కేసులు	అరెస్టైనవారు	స్వాధీనం చేసుకున్న సారా	స్వాధీనం చేసుకున్న నల్లబెల్లం	ధ్వంసం చేసిన పానకం
	853	972	5,182.8 లీటర్లు	1,06,818 కిలోలు	28,140
	పట్టుబడిన వాహనాలు : 263		బైండోవర్లు : 1,288	జరిమానా : రూ.22.27 లక్షలు	

మాతాశిశు మరణాలు తగ్గించాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

- విధులు సక్రమంగా నిర్వహించకుంటే చర్యలు
- కలెక్టర్ ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరైన బర్త్ ప్లాన్ చేయకపోవడంతోనే జిల్లాలో మాతాశిశు మరణాలు ఆగడం లేదని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇటీవల జిల్లాలో జరిగిన మాతాశిశు మరణాలపై కేసులు, పీహెచ్‌సీల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేసులకు సంబంధించి ఏఎన్‌సీ, కేషీట్లు, తర్వాత చదువుతున్న రిపోర్ట్‌లకు పొంతన లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గర్భిణులు ప్రసవం కోసం ముందుగా పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, జిల్లా ఆస్పత్రి నుంచి జనరల్ ఆస్పత్రికి సిఫార్సు చేయడం పరిపాటిగా మారిందన్నారు. అచ్చంపేట, కల్వకుర్తి సీహెచ్‌సీల్లోనూ గర్భిణులకు ప్రసవాలు చేసేందుకు సరైన ప్రణాళిక, స్పందన లేనట్లు ఫిర్యాదులు వస్తున్నాయని అసహనం వ్యక్తం చేశారు. విధులకు సక్రమంగా రాని డాక్టర్లు అవసరం లేదని చెప్పారు. అచ్చంపేట సీహెచ్‌సీలో గైర్హాజరైన డాక్టర్లకు సంజాయిషీ నోటీసు జారీ చేయాలని అచ్చంపేట ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రభు, కల్వకుర్తి సీహెచ్‌సీ నుంచి ఎందుకు రెఫర్ చేస్తున్నారో షోకాజ్ నోటీసు జారీ చేయాలని డీసీహెచ్‌ఎస్ రమేష్‌చంద్రను ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్, వైద్యులు పాల్గొన్నారు.

పకడ్బందీగా కంటివెలుగు..

జిల్లాలో రెండోవిడత కంటివెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టామని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. గురువారం ఉదయం కంటివెలుగు కార్యక్రమ సన్నద్ధతపై కలెక్టర్, అదనపు కలెక్టర్, వైద్య, పంచాయతీరాజ్, మున్సిపల్ అధికారులతో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 50 వైద్య బృందాలతో 547 వైద్య శిబిరాలను వంద పనిదినాల పాటు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. డాటా ఎంట్రీ ఆపరేటర్లకు అవగాహన కల్పించి శిక్షణ ఇవ్వడం జరిగిందని, జిల్లాకు 36 వేల దగ్గర చూపు కంటి అద్దాలు ఇప్పటికే వచ్చాయని వాటికి ఆయా మండలాలకు సరఫరా చేశామని చెప్పారు. ఆయా సమావేశాల్లో అదనపు కలెక్టర్ మనూచౌదరి, డీపీఓ కృష్ణ, డీఎంహెచ్‌ఓ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను వినియోగించుకోండి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి రాజేష్‌బాబు

నాగర్‌కర్నూల్ క్రైం: వచ్చేనెల 11న జరిగే లోక్ అదాలత్‌లో అత్యధికంగా కేసులు పరిష్కారమయ్యేలా పోలీస్ అధికారులు, న్యాయ విభాగం సమన్వయంతో పనిచేయాలని జిల్లా జడ్జి రాజేష్‌బాబు అన్నారు. గురువారం జిల్లా కోర్టులో రెవెన్యూ, పోలీస్ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు పెండింగ్‌లో ఉన్న కేసులను పరిశీలించి కక్షిదారులు రాజీకి వచ్చి పరిష్కరించుకోవాలనుకునే వాటిని లోక్‌అదాలత్‌లో పెట్టాలని ఆదేశించారు. రాజీమార్గం ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలనుకునే కక్షిదారులకు లోక్ అదాలత్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కోర్టు పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించి ఇరు పార్టీలు లేదా ఎవరో ఒకరు రాజీపడాలని అనుకునే లోక్ అదాలత్‌కు హాజరై కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. జిల్లాలో సివిల్ కేసులు 6,441, క్రిమినల్ కేసులు 7,390 పెండింగ్‌లో ఉన్నాయని, అబ్కారీ కేసులు, డ్రంకెన్ డ్రైవ్, సివిల్ కేసులు అధికంగా పరిష్కారం అయ్యేలా చార్జిషీట్ సకాలంలో దాఖలు చేయాలన్నారు. చార్జిషీట్ వేసి వదిలేయకుండా సమన్లు జారీ చేయడం, సాక్షులను కోర్టులో హాజరచడం వంటివి వెనువెంటనే చేపడితే చాలా కేసులు సత్వరం పరిష్కారం అవుతాయని చెప్పారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి సబిత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి స్వరూప, ఎస్పీ మనోహర్, డీఎస్పీలు మోహన్‌కుమార్, కృష్ణకుమార్, సీఐలు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెంపొందించాలి



మాట్లాడుతున్న డీఈఓ గోవిందరాజులు

కందనూలు: తక్కువ పెర్ఫార్మెన్స్ గల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాబోయే నెలలో పూర్తిస్థాయిలో దృష్టిసారించి విద్యార్థుల సామర్థ్యాలు ఆశించిన స్థాయిలో మెరుగుపరచాలని డీఈఓ గోవిందరాజులు అన్నారు. తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని మండల, క్లస్టర్ నోడల్ అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమాల అమలు తీరును విద్యార్థుల సామర్థ్యాల ప్రగతిని కాంప్లెక్స్ వారీగా హెచ్‌ఎంలతో సమీక్షించారు. ప్రతి మానిటరింగ్ అధికారి పాఠశాలలకు వెళ్లినప్పుడు తప్పనిసరిగా ఒక తరగతిలోని విద్యార్థుల తెలుగు, ఆంగ్లం, గణితంలో పాఠ్యపుస్తకంలోని కనీస సామర్థ్యాలు సాధించారా.. లేదా అని పరీక్షించాలని సూచించారు. ఉపాధ్యాయులు బోధన సోపానాలను పాటిస్తూ బోధిస్తున్నారా.. విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలించాలని చెప్పారు. టీఎల్‌ఎం సామగ్రిని బోధన పాఠ్యాంశానికి అనువైనదని, వాటిని ఉపయోగించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో సెక్టోరల్ అధికారి సతీష్‌కుమార్, నోడల్ అధికారి కుర్మయ్య, పరీక్షల పర్యవేక్షణాధికారి రాజశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికులకు అవగాహన

కల్వకుర్తి టౌన్: అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం ద్వారా అందే పథకాలపై అవగాహన అవసరమని ఉమ్మడి జిల్లా కార్మికశాఖ ఉప కమిషనర్ చంద్రశేఖర్ అన్నారు. గురువారం పట్టణంలో పలు భవనాల వద్ద పనిచేస్తున్న అసంఘటిత రంగా కార్మికులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా భవని నిర్మాణ కార్మిక రంగంలో ప్రమాదాలు అకస్మాత్తుగా సంభవిస్తాయని గుర్తుచేశారు. ప్రతిఒక్క కార్మికుడు ఈ-శ్రామ్ పోర్టల్ ద్వారా వారి వివరాలను నమోదు చేసుకోవాలని, లేదా సీఎస్‌సీ కేంద్రాల ద్వారా ఉచితంగా నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కల్వకుర్తి సహాయ కమిషనర్ మహేందర్ రావు, భవని నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు శ్రీనివాసులు, తాపీ మేస్త్రీలు, కార్మికులు, కూలీలు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సేవలకు అర్హులు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సబిత

నాగర్‌కర్నూల్ క్రైం: లీగల్ సర్వీసెస్ అథారిటీ కమిటీ ద్వారా బాలబాలికలు, మహిళలు ఉచిత న్యాయం పొందడానికి అర్హులని సీనియర్ సివిల్ జడ్జి, లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ సబిత అన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు యాసిడ్ దాడులపై గురువారం జిల్లాకేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు, మహిళలపై జరుగుతున్న యాసిడ్ దాడులను నివారించేందుకు తగిన జాగ్రత్తలు పాటించాలని విద్యార్థులకు వివరించారు. కుల, మత రహితమైన సమాజాన్ని కోరుకుంటూ తమ జీవిత లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకుని సమయాన్ని వృథా చేయకుండా చదువుతూ లక్ష్యాన్ని ఛేదించాలని సూచించారు. అమ్మాయిలు బయటకు వెళ్లినప్పుడు ఎవరైనా వేధింపులకు గురిచేసినట్లయితే వెంటనే తల్లిదండ్రులకు, స్నేహితులకు, ఉపాధ్యాయులకు తెలియజేసి దాడులు జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. యాసిడ్ దాడులపై గతంలో శిక్షలు విధించే అవకాశం లేకున్నా.. 2013 నుంచి యాసిడ్ దాడుల్లో కనీసం 10 సంవత్సరాలకు తగ్గకుండా శిక్ష పడే విధంగా సెక్షన్ 326లో పొందుపరిచారని తెలిపారు. జూనియర్ సివిల్ జడ్జ్ స్వరూప మాట్లాడుతూ సమస్యకు పరిష్కారం చట్టాల ద్వారానే సాధ్యం అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్తా, లీగల్ సర్వీసెస్ అథారిటీ కమిటీ, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్

బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వండి



కొల్లాపూర్‌లో నడుచుకుంటూ బహిరంగ సభకు వస్తున్న బండి సంజయ్ తదితరులు

కొల్లాపూర్: తెలంగాణ ఏర్పాటు లక్ష్యం, ఆశయం నెరవేరాలంటే ఒక్కసారి ప్రజలు బీజేపీకి అవకాశం ఇవ్వాలని, తద్వారా రాష్ట్రంలో రామరాజ్యం, కాషాయ రాజ్యాన్ని స్థాపిద్దామని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు కొల్లాపూర్ నియోజకవర్గంలో చేపట్టిన ప్రగతి కోసం పాదయాత్ర గురువారం ముగిసింది. ఈ సందర్భంగా స్థానిక రాజబంగ్లా ఎదుట నిర్వహించిన బహిరంగ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా పట్టణంలోని స్వామివివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రోడ్‌షోగా సభా వేదికవద్దకు చేరుకున్నారు. సభలో ఆయన మాట్లాడుతూ పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వకుండా కేసీఆర్ మాత్రం వంద గదులతో ప్రగతి భవన్ నిర్మించుకున్నారన్నారు. బీజేపీ పోరాటాల వల్లే ప్రగతి భవన్‌ను వీడి ప్రజలకు మధ్యకు వస్తున్నారన్నారు. పేదల దృష్టి మరల్చేందుకు, అభివృద్ధిపై చర్చ జరగకుండా ఉండేందుకే బీఆర్‌ఎస్‌ను స్థాపించారన్నారు. సర్పంచ్‌లకు కేంద్రం మంజూరు చేసిన నిధులను కేసీఆర్ ప్రభుత్వం దారి మళ్లించిందని, ఫలితంగా స్థానిక ప్రజాప్రతినిధులు అప్పుల పాలయ్యారన్నారు. సర్పంచ్‌లకు మిత్తీతో సహా దారి మళ్లించిన నిధులు మొత్తం చెల్లించాలని డిమాండ్ చేశారు. మేం లేఖ రాస్తేనే రేషన్‌బియ్యం పంపిణీ చేస్తున్నారని, ఉద్యోగులకు సమయానికి జీతాలు ఇవ్వడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే శ్రీశైలం నిర్వాసితులు, మాదాసి, మాదారి కురువలు, వాల్మీకిల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. సుధాకర్‌రావు కృషి వల్లే సోమశిల బ్రిడ్జి, జాతీయ రహదారి మంజూరైందని పేర్కొన్నారు. కొత్తగా జోగుళాంబ నుంచి కొల్లాపూర్ మీదుగా మరో రహదారి, కొల్లాపూర్‌కు రైల్వేలైన్ కావాలంటున్నారని, ఆయన పట్టుపడితే సాధించి తీరుతారని ప్రశంసించారు.

అవినీతి పెరిగింది..

20 ఏళ్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన వ్యక్తి కొల్లాపూర్‌కు చేసిందేమి లేదని సుధాకర్‌రావు అన్నారు. కొత్తగా గెలిచిన ఎమ్మెల్యే అభివృద్ధి కోసమని అధికార పార్టీలోకి మారాడని, అవినీతి పెరిగింది తప్ప అభివృద్ధి కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. నేను గత ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీని ఒప్పించి జాతీయరహదారి, సోమశిల బ్రిడ్జి మంజూరు చేయించానని, నాకు అవకాశం ఇస్తే కొల్లాపూర్‌కు రైల్వేలైన్ తీసుకొస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ మాధవి, నాయకులు దిలీపాచారి, శ్రీనివాస్‌యాదవ్, శేఖర్‌గౌడ్, నారాయణ, రోజారమణి, సాయికృష్ణగౌడ్, భరత్‌చంద్ర, మహేష్, సత్యనారాయణగౌడ్, భీమేష్, అన్వేష్, శశిరేఖ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నిరసన

కొల్లాపూర్‌లో నిర్వహించిన సభలో బండి సంజయ్ ప్రసంగాన్ని అడ్డుకునేందుకు ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రయత్నించారు. బండి సంజయ్ లేచిన వెంటనే ఎమ్మార్పీఎస్ నాయకులు సభా వేదిక వద్ద నల్లజెండాలు ప్రదర్శిస్తూ ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. దీంతో సంజయ్ ఎమ్మార్పీఎస్ నాయకుల వేదికపైకి పిలవగా.. ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి శివ మాదిగ, రాష్ట్ర కార్యదర్శి యాదగిరి మాట్లాడారు. బీజేపీ ఇచ్చిన మాట ప్రకారం వర్గీకరణ చేపట్టాలని వారు కోరారు.

108 ఉద్యోగుల జిల్లా కమిటీ ఎన్నిక

తెలకపల్లి: అత్యవసర సర్వీస్ అయిన 108 ఉద్యోగుల జిల్లా కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెలకపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 108 వాహన ఉద్యోగులు సమావేశమై జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సల్వాది కురుమూర్తి, ఉపాధ్యక్షుడిగా కృష్ణయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మయ్య, కోశాధికారిగా పర్వతాలు, సలహాదారులుగా శ్రీనివాస్, జావేద్, జహంగీర్, మల్లికార్జున్, సుజాత, కమిటీ సభ్యులుగా మద్దిలేటి, రవికుమార్, వరప్రసాద్, పాండురంగయ్య, శివరాజ్, ఇబ్రహీం, తిరుపతయ్య, శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు.

ముగిసిన టై అండ్‌ డై శిక్షణ



శిక్షణలో చీరకు రంగులు వేసిన మహిళలు

- 15రోజులుగా శిక్షణ పొందిన 30మంది మహిళలు
- సహకారం అందించిన నాబార్డు



దుస్తులకు రంగులు వేయటం నేర్పిస్తున్న శిక్షకుడు

జడ్చర్ల టౌన్‌: నాబార్డు సహకారంతో స్థానిక ఇందిరా ప్రియదర్శిని ఉమెన్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో పట్టణంలోని శాంతినగర్‌ మహిళా సమాఖ్య భవనంలో 15రోజులుగా ఇస్తున్న టై అండ్‌ డై శిక్షణ గురువారంతో ముగిసింది. మొత్తం 30మంది మహిళలు ఉచితంగా శిక్షణ పొందారు. జర్దోసి, మగ్గం వర్క్‌లపై అవగాహన ఉన్న మహిళలకు టై అండ్‌ డై శిక్షణ ఇవ్వటంతో స్వయం ఉపాధికి మంచి మార్గం అవుతుందని అభిప్రాయపడుతున్నారు. చీరలకు రంగులు అద్దటం వినటమే తప్ప తాము ఎప్పుడూ చూడలేదని ఇదో కొత్త అనుభూతిని కలిగిస్తుందని మహిళలు తెలిపారు. శిక్షణ పొందిన వారికి ధ్రువపత్రాలు ఇవ్వటంతో వారికి బ్యాంకు రుణాలు సులువుగా లభించేందుకు మార్గం ఏర్పడినట్లయ్యింది. శిబిరం ప్రారంభం సందర్భంగా నాబార్డు ఏజీఎం, లీడ్‌బ్యాంక్‌ మేనేజర్లు సైతం శిక్షణ తర్వాత అవసరమైన రుణాలు ఇచ్చేందుకు సిద్ధం ఉన్నామని ప్రకటించటంతో మహిళాసాధికారికతకు కారణం కానుంది. శిక్షకుడు నర్సింహులు 15రోజులుగా మహిళలకు చీరలు, చున్నీలు, డ్రస్‌మెటీరియల్స్‌ వంటి వాటికి రంగులు ఎలా అద్దాలో ప్రదర్శనల ద్వారా నేర్పించారు. అలాగే రోలింగ్‌, ఫినిషింగ్‌లోనూ తర్ఫీదు ఇచ్చారు. రంగులు అద్దిన చీరలు చివరి రోజున ప్రదర్శనలో ఉంచారు. శిక్షణ కాలంలో ఒక్కో మహిళకు రూ.750స్టైఫండ్‌ అందించి మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు.

రెండో బ్యాచ్‌ ప్రారంభిస్తాం



నాబార్డు సహకారంతో శిక్షణ రెండో బ్యాచ్‌ను త్వరలో ప్రారంభిస్తాం. మొదటి బ్యాచ్‌కు ఊహించని స్పందన వచ్చింది. మహిళలను ఆర్థికంగా అభివృద్ధి పథంలోకి తీసుకురావటానికి మా అసోసియేషన్‌ చేస్తున్న ప్రయత్నంలో భాగంగానే ఉచిత శిక్షణ ఇచ్చాము. శిక్షణ పొందిన వారికి బ్యాంకు రుణాలు ఇప్పించేందుకు మా వంతు కృషి చేస్తాం.

– గోవర్ధని, నిర్వాహకురాలు

శిక్షణ ఎంతో ఉపయోగం



టై అండ్‌ డై శిక్షణ ఎంతో ఉపయోగంగా ఉంది. జీవితంలో ఆర్థికంగా స్థిరపడటానికి నాకు మార్గం దొరికింది. ఇన్నాళ్లు టైలరింగ్‌, జర్దోసి, మగ్గం వర్క్‌ గురించి మాత్రమే తెలుసు. ఇలా రంగులు అద్దటం కొత్తగా ఉంది. నాలాంటి మహిళలకు శిక్షణలు ఎంతో ఉపయోగపడతాయి. ఇంట్లోనే ఉండి పనిచేసుకోవచ్చు.

– పల్లవి, నిమ్మబావిగడ్డ, బాదేపల్లి పట్టణం

కొత్త అనుభూతి



చీరలు, ఇతర దుస్తులకు రంగులు అద్దటం టైఅండ్‌డై కొత్త అనుభూతిని కలిగించింది. హైదరాబాద్‌లాంటి నగరాల్లోనే ఇలాంటి శిక్షణ ఇస్తుంటారు. నేను ఇంతకుముందు ఎన్నోసార్లు ఇక్కడ శిక్షణ ఇస్తారేమోనని చూశాను. ఇప్పటికి నా కల నెరవేరింది. శిక్షణ పొందిన వాళ్లం గ్రూపుగా ఏర్పడి కలిసి పనిచేస్తాం.

– శ్రీవాణి, శాంతినగర్‌, బాదేపల్లి పట్టణం

ఇప్పుడే వింటున్నా..



టైఅండ్‌డై అనే పదం శిక్షణకు వచ్చాకే విన్నాను. రోజు రోజుకు ఎంతో శ్రద్ధ పెరిగింది. రంగులు అద్దటం చూశాక నాలో కొత్త ఉత్సాహం వచ్చింది. టై అండ్‌ డై ద్వారా ఉపాధి కల్పించుకునేందుకు ప్రయత్నిస్తాను. నాలాగే మరింత మందికి శిక్షణ ఇవ్వటం వల్ల ఎంతో ప్రయోజనంగా ఉంటుంది.

–సమీరాబేగం, బాదేవల్లి పట్టణం

ప్రైవేట్‌ ట్రావెల్‌ బస్సు బోల్తా

- ముగ్గురికి గాయాలు



బోల్తా పడిన బస్సు

అడ్డాకుల: మూసాపేట మండలం సంకలమద్ది శివారులో బుధవారం అర్ధరాత్రి హైవేపై ప్రైవేట్‌ ట్రావెల్‌ బస్సు బోల్తాపడింది. ఈ సంఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ నరేష్‌ తెలిపిన వివరాల ప్రకారం.. బెంగళూర్‌కు చెందిన జీపీ ట్రావెల్స్‌ బస్సు డ్రైవర్‌ ఎండీ.రిజ్వాన్‌ బుధవారం రాత్రి 30 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌ నుంచి బెంగళూర్‌కు బయలు దేరాడు. మార్గమధ్యలో సంకలమద్ది శివారులోని జాతీయ రహదారిపై అర్ధరాత్రి తర్వాత ముందు వెళ్తున్న డీసీఎం దాని ముందు వెళ్తున్న మిని బొలెరోను ఢీకొట్టడంతో బొలెరో రోడ్డు కిందకు దూసుకెళ్లి బోల్తాపడింది. తర్వాత డీసీఎంను బస్సు ఓవర్‌ టేక్‌ చేయబోతుండగా డీసీఎం తగలడంతో బస్సు రోడ్డు కిందకు దూసుకెళ్లింది. అదే వైపు బస్సులోని లగేజీలో పెద్ద ఎత్తున ఇనుప సామగ్రి ఉండటంతో బస్సు అదుపు తప్పి బోల్తాపడింది. ఈక్రమంలో బస్సులో ఉన్న 30 మందిలో ముగ్గురికి గాయాలయ్యాయి. మిగిలిన వారిలో కొందరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. బస్సు ముందు అద్దాలు ధ్వంసం కావడంతో పాటు పక్కన ఉన్న కిటికీల అద్దాలు పగిలిపోయాయి. బోల్తా పడిన బస్సులో నుంచి ప్రయాణికులు అతికష్టం మీద బయటకు వచ్చారు. బస్సు క్లీనర్‌ ఎండీ.ఖాసీం, బెంగళూర్‌కు చెందిన సానిక్‌ బిస్వార్‌, దివ్యకరుణాకరన్‌లకు గాయాలయ్యాయి. వారిని అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మిగిలిన వారు వేర్వేరు వాహనాల్లో తమ స్వస్థలాలకు వెళ్లిపోయారు. గురువారం ఉదయం ఎల్‌అండ్‌టీ సిబ్బంది బస్సును ప్రమాద స్థలం నుంచి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్‌ తెలిపారు.

ఓవర్‌లోడ్‌ లగేజీ కారణం

హైదరాబాద్‌ నుంచి బెంగళూర్‌కు వెళ్తున్న ట్రావెల్‌ బస్సులో ఓవర్‌లోడ్‌ లగేజీ ఉంది. బస్సుకు ఎడమ వైపు ఉన్న లగేజ్‌ బాక్స్‌లో బరువైన ఇనుప నట్లు, బోల్టులతో పాటు ఇతర సామగ్రి ఉన్నాయి. డీసీఎం బస్సుకు తగిలినప్పుడు బస్సు ఎడమ వైపు రోడ్డు కిందకు దిగి కొంత దూరం వరకు వెళ్లింది. ఈక్రమంలో బస్సులో ఉన్న లగేజీ మూలంగా బస్సు అదుపు తప్పి రోడ్డుపై బోల్తాపడినట్లు తెలుస్తుంది.

డ్రమ్‌సీడర్‌తో అధిక లాభాలు



డ్రమ్‌సీడర్‌ పరికరంతో వరి విత్తనాలు నాటుతుండగా పరిశీలిస్తున్న రైతులు, అధికారులు

- వ్యవసాయ స్పెషల్‌ కమిషనర్‌ హన్మంతు

భూత్పూర్‌: డ్రమ్‌ సీడర్‌తో వరి నాటితే తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చని వ్యవసాయ స్పెషల్‌ కమిషనర్‌ హన్మంతు అన్నారు. గురువారం మండలంలోని కర్వెనలో వ్యవసాయ పొలంలో నిర్వహించిన క్షేత్ర స్థాయిలో ప్రదర్శనలో జిల్లా వ్యవసాయాధికారి వెంకటేష్‌, దేవరకద్ర ఏడీఏ యశ్వంత్‌రావు, డ్రమ్‌ సీడర్‌ ప్రాజెక్టు స్కాలర్‌ స్టీఫెన్‌తో కలిసి డ్రమ్‌ సీడర్‌తో వరి విత్తనాలను నాటుటను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కర్వెనలో రైతువేదికలో వ్యవసాయ స్పెషల్‌ కమిషనర్‌ మాట్లాడుతూ.. రైతులు ఎకరాకు 10 నుంచి 12 కిలోలు వరి విత్తనాలు సరిపోతాయని, సాళ్ల మధ్య దూరం ఎక్కువ ఉండటంతో గాలి వెలుతురు వల్ల చీడపీడలు తగ్గుతాయన్నారు. గ్రామంలో 12 మంది రైతులు డ్రమ్‌ సీడర్‌ ద్వారా వరి సాగుకు ముందుకు రావడంతో మండల వ్యవసాయాధికారులను ప్రశంసించారు. ఆయిల్‌ఫామ్‌ సాగును కూడా ప్రోత్సహించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ మురళీధర్‌, ఏఈవో హన్మంతు, కోఆర్డినేటర్‌ ప్రతాప్‌, రైతులు పాల్గొన్నారు.

కానాయపల్లి నిర్వాసితులకు న్యాయం చేయాలి



దీక్షలో కూర్చున్న రాచాల యుగంధర్‌గౌడ్‌

కొత్తకోట: ముంపు గ్రామం కానాయపల్లి నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే న్యాయం చేయాలని బీసీ పొలిటికల్‌ జేఏసీ రాష్ట్ర చైర్మన్‌ రాచాల యుగంధర్‌గౌడ్‌ డిమాండ్‌ చేశారు. మండలంలోని కానాయపల్లి నిర్వాసితుల సమస్యలపై గురువారం కొత్తకోట చౌరస్తాలో ఆయన ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రాచాల మాట్లాడుతూ దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి శంకరసముద్ర రిజర్వాయర్‌ నిర్మాణ పనుల్లో కక్కుర్తి పడుతున్నాడని ఆరోపించారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేస్తూ వస్తున్నాడని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి 9ఏళ్లు గడుస్తున్నా రిజర్వాయర్‌ నిర్మాణం పూర్తి చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. 2018 మే 7న బీసీ సంఘం ఆధ్వర్యంలో కానాయపల్లి టు కలెక్టరేట్‌ వరకు పాదయాత్ర చేపడితే 3నెలల్లో నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి విస్మరించారని తెలిపారు. ఈ దీక్షను అఖిలపక్షం ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్‌యాదవ్‌ ప్రారంభించారు. నిర్వేన్‌ సర్పంచ్‌ విశ్వనాథం, బీజేపీ నాయకులు సాయిరాం, కాంగ్రెస్‌ నాయకులు మహేష్‌ సంఘీభావం తెలిపారు. దీక్షలో బీసీ నాయకులు అంజన్నయాదవ్‌, అరవిందాచారి, మహిందర్‌నాయుడు, శేఖర్‌గౌడ్‌, స్వామి, సత్యనారాయణ, మల్లేష్‌, మేఘనాథ్‌గౌడ్‌, ప్రవీణ్‌, లక్ష్మినరసింహ, బాలరాజు, నిర్వాసితులు శ్రీనువాస్‌, శివకృష్ణ, నరేష్‌, వెంకటయ్య కూర్చున్నారు.

ఉన్నత లక్ష్యాలను సాధించాలి



రక్తదానం చేస్తున్న యువకులు

- డీఐజీ ఎల్‌.ఎస్‌ చౌహాన్‌

మహబూబ్‌నగర్‌ క్రైం: ఈ తరం యువత ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని వాటిని చేరుకోవడానికి కష్టపడాలని జోగుళాంబ జోన్‌ డీఐజీ ఎల్‌.ఎస్‌ చౌహాన్‌ అన్నారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్‌ శాఖ ఆధ్వర్యంలో గురువారం పరేడ్‌ మైదానంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని డీఐజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం యువతలో దాగివున్న ప్రతిభను వెలికితీసి ప్రోత్సాహించడమన్నారు. టెక్నాలజీని సక్రమంగా ఉపయోగించి ఉన్నతికి వాడుకోవాలన్నారు. శిబిరంలో పట్టణానికి చెందిన 173మంది యువత రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎస్పీ వెంకటేశ్వర్లు, అదనపు ఎస్పీ రాములు, రెడ్‌క్రాస్‌ చైర్మన్‌ నటరాజ్‌, డాక్టర్‌ శ్యామూల్‌ పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

జాతీయ యువజన దినోత్సవాల్లో భాగంగా ప్రతి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో నిర్వహించిన క్రీడాపోటీల్లో గెలుపొందిన వారికి పరేడ్‌ మైదానంలో డీఐజీ ఎల్‌.ఎస్‌ చౌహాన్‌ బహుమతులు అందించారు. ఎంవీఎస్‌ డిగ్రీ కళాశాల, ఎన్టీఆర్‌ మహిళా డిగ్రీ కళాశాల నుంచి గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్‌ ప్రదానం చేశారు.

అగ్ని ప్రమాదంలో గుడిసె దగ్ధం

బల్మూర్‌: మండలంలోని బాణాలలో గురువారం పూరి గుడిసె కాలి బూడిదైంది. సర్పంచ్‌ పద్మ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పుల్లమ్మ పూరి గుడిసె ముందున్న వరిగడ్డి విద్యుదాఘాతంతో నిప్పంటుకుంది. దీంతో పూరి గుడిసెకు మంటలు వ్యాప్తించాయి. అచ్చంపేట ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో గుడిసెలో ఉన్న రూ.4వేల నగదు, బియ్యం, దుస్తులు పూర్తిగా కాలిపోయాయి. ప్రమాదంలో సుమారు రూ.50వేల వరకు ఆస్తినష్టం అయినట్లు సర్పంచ్‌ తెలిపారు.

కేఎల్‌ఐ కాల్వలకు గండ్లు

కోడేరు: మండల కేంద్రం శివారులో ఉన్న కేఎల్‌ఐ మైనర్‌-1, సబ్‌-1 కాల్వలకు రెండు చోట్ల గండ్లు పడటంతో సాగునీరు వృథాగా పోతుంది. అధికారులు నామమాత్రంగా మరమ్మతు పనులు చేసి వదిలేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి గండ్లు పడిన చోట మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు. గండ్లు పడటంతో ఇతర గ్రామాలకు సాగునీరు నిలిచిపోయింది. గండ్లు పడిన చోట కొందరు రైతులు తాత్కాలికంగా మరమ్మతు చేసుకున్నారు.



ఆధునిక వ్యవసాయాన్ని అలవర్చుకోవాలి



డ్రోన్‌ వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

బిజినేపల్లి: రైతులు ఆధునిక పద్ధతిలో వ్యవసాయం చేయాలని, ప్రధానంగా యంత్రీకరణపై అవగాహన పెంచుకోవాలని పాలెం ఆర్‌ఏఆర్‌ఎస్‌ ఏడీఆర్‌ గోవర్దన్‌ అన్నారు. మండల కేంద్రానికి చెందిన రైతులకు వ్యవసాయంలో మారుతున్న వాతావరణ మార్పులకు అనుగుణంగా పాటించాల్సిన పద్ధతులపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా చివరి రోజు గురువారం యాంత్రీకరణపై మండలంలోని బోయాపూర్‌ గ్రామంలో క్షేత్రస్థాయిలో వివరించారు. గ్రామంలో డ్రోన్‌ ద్వారా పిచికారి ఏవిధంగా చేయాలని, యాంత్రీకరణ వల్ల కలిగే లాభాలు, ఖర్చు, రాబడి వంటి అంశాలను వివరించారు. వాతావరణ మార్పుల వల్ల పంటలు తీవ్రంగా నష్టపోతాయని, అలాంటి కాకుండా ముందస్తుగా మార్పులను ఎలా పసిగట్టాలో తెలిపారు. ఆర్‌ఏఆర్‌ఎస్‌ ప్రాజెక్ట్‌ శాస్త్రవేత్తలు దివ్యారాణి, శంకర్‌, మాధురి, నూనె గింజల ప్రధాన శాస్త్రవేత్త సుజాత, మమత, స్రవంతి, బోయాపూర్‌ సర్పంచ్‌ రాఘవులు, ఏఈఓ శారద పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో గేటు, కంచె ఏర్పాటు

- సర్పంచ్‌ ఫిర్యాదుతో తొలగింపు



ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన గేటును తొలగించిన పంచాయతీ సిబ్బంది

బాలానగర్‌: మండలంలోని బోడజానంపేట్‌ రెవెన్యూ పంచాయతీలోని సర్వే నెంబర్‌ 83 పలుగుమీదితండా పంచాయతీలో పల్లెప్రకృతి వనం ఏర్పాటు చేశారు. కొద్దిరోజులుగా కురిసిన అతి వర్షాలతో మొక్కలకు నీరు పోయాల్సిన అవసరం లేకపోవడంతో పాలకమండలి సభ్యులు అటువైపుగా చూడలేదు. దీంతో పక్కనే ఉన్న పరిశ్రమకు చెందిన వ్యక్తులు సుమారు 3 ఎకరాల భూమిలో అక్రమంగా కంచె ఏర్పాటు చేయడంతోపాటు పల్లె ప్రకృతివనంలోకి కూడా వెళ్లేందుకు వీల్లేకుండా గేటు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నారని సర్పంచ్‌ మంజుల, ఉప సర్పంచ్‌ శివ, వార్డు సభ్యులు నాలుగు రోజుల క్రితం తహసీల్దార్‌ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. ఉన్న ప్రభుత్వ భూమిలో క్రీడాప్రాంగణం ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు. దీంతో స్పందించిన తహసీల్దార్‌ బుధవారం ఆర్‌ఐ వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ సర్వేయర్‌తో సర్వే చేయించి హద్దులు సైతం ఏర్పాటు చేయించారు. వెంటనే గేటును తొలగించాలని సర్పంచ్‌కు ఆదేశించారు. దీంతో గురువారం సర్పంచ్‌ భర్త రాంబాబు, ఉప సర్పంచ్‌, సభ్యులు గేటును జేసీబీ సాయంతో తొలగించారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ భూమిని ఆక్రమించడమే కాకుండా అక్రమంగా పల్లె ప్రకృతి వనానికి వెళ్లేందుకు వీలు లేకుండా గేటు ఏర్పాటు చేశారన్నారు. క్రీడా ప్రాంగణం కోసం ప్రభుత్వ స్థలం గుర్తించే క్రమంలో అక్కడకు వచ్చిన తమకు ప్రైవేట్‌ పరిశ్రమ వ్యక్తులు కబ్జా చేశారని తెలిసిందని అన్నారు. అంతేకాకుండా తమకు ప్రభుత్వం ఇచ్చిన ఇనాం భూమిలో నుంచి పోవడానికి వీలు లేదని పరిశ్రమ వ్యక్తులను ప్రశ్నించగా తమను పోలీసులతో వేధిస్తున్నారని వాపోయారు.

❒ సంఘటనపై పరిశ్రమ ప్రతినిధి వంశీ మాట్లాడుతూ.. తాము ఇంతకు ముందు భూమి అమ్మిన వ్యక్తులే కంచె, గేటు ఏర్పాటు చేసి ఇచ్చారని తెలిపారు. ఏడీ సర్వే కోసం దరఖాస్తు చేసుకున్నామని ప్రభుత్వ భూమి అయితే తమకు అవసరం లేదని అన్నారు. సర్వే అనంతరం తమ భూమి చుట్టు కంచె ఏర్పాటు చేసుకుంటామని తెలిపారు. తమ కంపెనీకి దారి కోసం కలెక్టరుకు దరఖాస్తు చేసుకున్నామని పేర్కొన్నారు.

❒ ఈ విషయంపై తహసీల్దార్‌ శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. తమకు ఫిర్యాదు అందిన వెంటనే ఆర్‌ఐ, సర్వేయర్‌తో ప్రభుత్వ భూమిని గుర్తించి హద్దులు ఏర్పాటు చేశామన్నారు. పరిశ్రమ వ్యక్తుల కోరిక మేరకు ఏడీ సర్వే అనంతరం ప్రభుత్వ భూమిలో తెలంగాణ క్రీడాప్రాంగణం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో అన్న మృతి

తమ్ముడి పరిస్థితి విషమం

జడ్చర్ల: పట్టణ శివారులోని కావేరమ్మపేట ప్రభుత్వ అతిథి గృహం వద్ద చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో అన్న మృతి చెందగా, తమ్ముడికి తీవ్ర గాయాలయ్యాయి. పెబ్బేరు మండలం యాపర్లకు చెందిన ప్రశాంత్‌(28), విష్ణు అన్నదమ్ములు గురువారం బైక్‌పై హైదరాబాద్‌ నుంచి జడ్చర్ల వైపు వస్తున్నారు. కావేరమ్మపేట ప్రభుత్వ అతిథి గృహం వద్దకు రాగానే ముందు వెళ్తున్న లారీ అకస్మికంగా బ్రేక్‌ వేయడంతో వెనుక వైపు నుంచి వీరు ఢీకొన్నారు. బైక్‌పై ఉన్న ఇద్దరు సోదరులు తీవ్రంగ గాయపడ్డారు. వీరిని చికిత్స కోసం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ప్రశాంత్‌ మృతి చెందాడు. తమ్ముడు విష్ణు పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆగి ఉన్న డీసీఎంను ఢీకొని వ్యక్తి దుర్మరణం

బాలానగర్‌ (రాజాపూర్‌): ఆగి ఉన్న డీసీఎంను ఢీకొన్న ద్విచక్ర వాహనదారుడు అక్కడిక్కడే మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి రాజాపూర్‌ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా.. రాజాపూర్‌ చెందిన నర్సింహులుగౌడ్‌ (45) బాలానగర్‌ వైపు నుంచి జడ్చర్ల వైపు ద్విచక్రవాహనంపై వస్తుండగా జాతీయ రహదారిపై పోలీస్‌స్టేషన్‌ సమీపంలో రోడ్డుపై ఆగి ఉన్న డీసీఎంను స్కూటీతో ఢీకొన్నాడు. ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు.

క్లుప్తంగా

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

బల్మూర్‌: భర్త, అత్త వేధింపులు తాళలేక వివాహిత పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌ఐ శివానందంగౌడ్‌, మృతురాలి కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బాణాలకు చెందిన మాయిని తిరుపతయ్యకు వంగూరు మండలం ఎల్లమ్మ రంగాపూర్‌ చెందిన శిరీష(21)తో రెండేళ్ల క్రితం వివాహమైంది. ఆరు నెలల కిత్రం వీరికి పాప పుట్టింది. భర్తతో పాటు అత్త లక్ష్మమ్మ పుట్టింటి నుంచి అదనపు కట్నం తేవాలని తరుచూ వేధిస్తున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది గురువారం ఉదయం ఇంట్లో పురుగు మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం శిరీషను అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి తల్లి జంగమ్మకు ఫోన్‌లో సమాచారం అందించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో నాగర్‌కర్నూల్‌ తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. తన కూతురిని నిత్యం కట్నం కోసం వేధిస్తుండటంతో ఫోన్‌చేసి బాధపడేదని, పండుగకు ఇంటికి తీసుకెళ్దామనే లోపే వారి వేధింపులు అధికమై ఆత్మహత్యకు పాల్పడిందని తల్లి జంగమ్మ కన్నీటి పర్యతమైంది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

భార్య కాపురానికి రాలేదని..

జడ్చర్ల: స్థానిక శ్రీనివాసనగర్‌ కాలనీకి చెందిన కుమార్‌(32) గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొన్నేళ్ల క్రితం ఆయన భార్య విడిచి వెళ్లిన తర్వాత తల్లి భీమమ్మతో కలిసి ఉంటున్నాడు. భార్య కాపురానికి రాకపోవడం, ఇతర కారణాలతో ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని స్థానికులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో..



తుదు చింతల బాలయ్య (ఫైల్‌)

మన్ననూర్‌: అమ్రాబాద్‌ మండలం ప్రశాంతినగర్‌ గ్రామానికి చెందిన చింతల బాలయ్య(45) ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులు కుటుంబ అవసరాలకు డబ్బులు లేక మానసికంగా కుంగిపోతుండేవాడని తెలిపారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి కుటుంబ సభ్యులంతా ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ఆరు బయట నుంచి ఇంటి తలుపులు మూసేసి ఇంటి ముందున్న సపారం (మచ్చు)కు ఉరేసుకున్నాడు. సమీప వ్యక్తులు గమనించి ఇంటి తలుపులకు ఉన్న గడియ తీసి కుటుంబ సభ్యులకు సమాచారం తెలిపారు. కిందికి దింపి పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. మృతునికి భార్య కృష్ణమ్మతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు.

బాలిక మృతిపై కేసు నమోదు

గట్టు: తుమ్మలచెరువులో విద్యుతాఘాతంతో ప్రియాంక(9)మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పవన్‌కుమార్‌ గురువారం తెలిపారు. తుమ్మలచెరువు సమీపంలో శేఖర్‌రెడ్డి పొలం వద్ద కాల్వ కోసం తవ్విన మట్టి కుప్పల్లో ఆడుకుంటూ విద్యుత్‌ తీగలు తాకడంతో బాలిక మృతి చెందిన విషయం తెలిసిందే. మృతదేహానికి గద్వాల ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఎర్రవల్లిచౌరస్తా: జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. కోదండాపురం ఎస్‌ఐ వెంకటస్వామి తెలిపిన వివరాలు ఇలా.. ఇటిక్యాల మండలంలోని వేముల స్టేజీ సమీపంలో గల ప్రియదర్శిని రెస్టారెంట్‌ వద్ద కర్నూల్‌ నుంచి హైదరాబాద్‌ వెళ్లే రోడ్డులో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం గుర్తు తెలియని వ్యక్తి(45)ని ఢీకొట్టి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. శరీరం పూర్తిగా నుజ్జునుజ్జు కావడంతో గుర్తు పట్టలేని స్థితిలో ఉందన్నారు. ప్రస్తుతం మృతదేహం అలంపూర్‌ ఆస్పత్రిలో ఉందని ఆచూకీ తెలిసిన వారు 9440904768 నంబర్‌ను సంప్రదించాలని ఎస్‌ఐ పేర్కొన్నారు.

మద్యం తాగి లారీ నడిపిన డ్రైవర్‌కు జైలు శిక్ష

దేవరకద్ర: మద్యం తాగి లారీని నడిపిన డ్రైవర్‌కు ఏడు రోజుల జైలు శిక్షతో పాటు రూ.4 వేల జరిమానాను కోర్టు విధించిందని ఎస్‌ఐ భగవంతరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం రాత్రి డ్రంకెన్‌ డ్రైవ్‌ తనిఖీ నిర్వహిస్తుండగా తమిళనాడుకు చెందిన మధు (35) మద్యం తాగి లారీని నడిపిస్తున్నట్లు గుర్తించి పరీక్షించినట్లు తెలిపారు. గురువారం ఉదయం లారీ డ్రైవర్‌ను కోర్టులో ప్రవేశపెట్టగా శిక్ష ఖరారైందని తెలిపారు.

అలవి వలల పట్టివేత

కొల్లాపూర్‌: అమరగిరి సమీపంలోని కృష్ణానదిలో అలవి వలలను పట్టుకున్నట్లు ఎస్‌ఐ బాలవెంకటరమణ తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు మత్స్యశాఖ అధికారులతో కలిసి నదితీర ప్రాంతాల్లో తనిఖీ చేపట్టినట్లు చెప్పారు. అలవి వలలను స్వాధీనం చేసుకుని, మత్స్యశాఖ అధికారుల ఫిర్యాదు మేరకు మిద్దెరాజు, పలువురు కూలీలపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

క్లుప్తంగా

కబడ్డీ పోటీలు ప్రారంభం
వెల్దండ: మండలంలోని పోశమ్మగడ్డతండాలో ఐక్యత ఫౌండేషన్, నవచైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యుడు వరప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములు సమానంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వరలక్ష్మి, గిరిజన సంఘం మండల అధ్యక్షుడు పంతునాయక్, మాజీ సర్పంచ్ లాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి
కల్వకుర్తి టౌన్: పట్టణ మహిళా సమాఖ్యలో నెలకొన్న పలు విషయాలపై మహిళా సంఘాల సభ్యులు కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిశారు. అదేవిధంగా మున్సిపల్ చైర్మన్ సత్యంకు టీఎల్ఎఫ్ సభ్యులు వినతి అందజేశారు.

కంటి చికిత్సకు ఆర్థికసాయం
కల్వకుర్తిరూరల్: పట్టణానికి చెందిన లావణ్య కుమార్తె సౌమ్య కంటి సమస్యతో బాధపడుతుంది. సౌమ్య కంటి చికిత్సకు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి చేయూత అందించారు. కార్యక్రమంలో రేష్మ, రాజేశ్వరి, రెహాన, ఫౌండేషన్ సభ్యులు శ్రీపతిరాజు, గణేష్, శేఖర్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి
అచ్చంపేట రూరల్: గ్రామాలభివృద్ధికి పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక కృషి చేయాలని ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓ వెంకటయ్య కోరారు. గురువారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ హాలులో నియోజకవర్గంలోని అన్ని మండలాల ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులకు అభివృద్ధి ప్రణాళికపై ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.

అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయం
కల్వకుర్తి: అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. గురువారం సాయంత్రం క్యాంపు కార్యాలయ ఆవరణలో కల్వకుర్తి, వెల్దండ, చారగొండ మండలాలకు సంబంధించిన లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం పట్టణంలోని డబుల్‌బెడ్రూం ఇళ్లను ఎమ్మెల్యే పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం, ఎంపీపీ మనోహర చెన్నకేశవులు, వెల్దండ జెడ్పీటీసీ విజితారెడ్డి, సర్పంచ్ భూపతిరెడ్డి ఉన్నారు.

నిధులు మంజూరు చేయండి
వెల్దండ: గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని గురువారం ఎంపీ రాములు, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డిలకు వేర్వేరుగా సర్పంచ్‌లు వినతిపత్రం అందజేశారు. హైమాస్ట్ లైట్లు, సీసీరోడ్లు, కమ్యూనిటీ భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గోళి శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ గోరటి శ్రీనివాసులు, అంజినాయక్, రామస్వామి, సింగిల్ విండో డైరెక్టర్ నాగులునాయక్, కొండల్ తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ
చారకొండ: ఈనెల 13, 14న రంగారెడ్డి జిల్లా మన్నెగూడలో నిర్వహించనున్న టీఎస్ యూటీఎఫ్ 5వ మహాసభల వాల్‌పోస్టర్లను మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంఘం నాయకులు గురువారం ఆవిష్కరించారు. మహాసభలకు ఉపాధ్యాయులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని గౌరవ అధ్యక్షుడు అంజయ్య కోరారు.

పాఠశాలల పరిశీలన
తాడూరు: మండలంలోని అల్లాపూర్, మేడిపూర్ పాఠశాలలను కాంప్లెక్స్ చైర్మన్ అనీల్‌కుమార్‌రెడ్డి గురువారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపరిచే విధంగా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన కోరారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో సన్మానం
వెల్దండ: ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడిగా ఎన్నికైన మల్లేష్ ముదిరాజ్, బొక్కల శ్రీను, శ్రీశైలంలను గురువారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

సీఎస్ ఎంపికపై హర్షం
మన్ననూర్: రాష్ట్ర చరిత్రలో తొలి మహిళా సీఎస్‌గా శాంతకుమారి ఎంపికపై రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ టూరిజం చైర్మన్ జూలూరి సత్యనారాయణ, వెంకటరమణ, జీసీసీ ఉద్యోగులు ఒక సంయుక్త ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మహిళా సీఎస్ సేవలు రాష్ట్రానికి అవసరమనే ఉద్దేశ్యంతో అవకాశం కల్పించడం సీఎం కేసీఆర్‌కు మహిళల పట్ల ఉన్న గౌరవానికి నిదర్శనమని కొనియాడారు.

సబ్సిడీ బియ్యం కొనసాగించాలి
కోడేరు: రేషన్‌కార్డు లబ్ధిదారులకు గతంలో ఇస్తున్నట్లుగా ఆరు కిలోల బియ్యం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహా డీటీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మల్లయ్య, ఆంజనేయులు, వెంకటమ్మ, తిరుపతి, బాలస్వామి పాల్గొన్నారు.

పరామర్శ
బిజినేపల్లి: మండల కేంద్రానికి చెందిన దూల కాశమ్మ అనే మహిళ అనారోగ్యంతో మృతిచెందడంతో బాధిత కుటుంబాన్ని గురువారం రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు నెల్లికంటి మహేశ్వర్‌రెడ్డి పరామర్శించారు.


కల్వకుర్తిలో జెండా ఊపి రన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్


మన్ననూరులో నివాళులర్పిస్తున్న స్వయం సేవక్ కార్యకర్తలు


ఉప్పునుంతలలో..


తాడూరు మండలం విఠోల్ పాఠశాలలో..

యువతకు ఆదర్శం స్వామి వివేకానంద

స్వామి వివేకానంద యువతకు ఆదర్శమని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు అన్నారు. గురువారం స్వామి వివేకానంద జయంతిని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. అచ్చంపేటలోని బస్టాండ్ ఎదుట ఉన్న వివేకానంద విగ్రహానికి ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వివేకానంద విగ్రహ ఏర్పాటుకు రూ.5లక్షల విరాళం ప్రకటించారు. జిల్లా కేంద్రంలోని రాంనగర్‌కాలనీలో స్వామి వివేకానంద విగ్రహాన్ని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఆవిష్కరించారు. కలెక్టరేట్ ఆవరణలో స్వామి వివేకానంద జయంతిని జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డీఈఓ కార్యాలయంలో డీఈఓ గోవిందరాజులు పూలమాల వేసి నివాళులర్పించారు. యువజన దినోత్సవం సందర్భంగా కల్వకుర్తిలో పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన 2–కె రన్‌ను కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ జెండా ఊపి ప్రారంభించారు. అలాగే జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో, మండలాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు స్వామి వివేకానందకు ఘన నివాళులర్పించారు.

– సాక్షి, నెట్‌వర్క్


జిల్లాకేంద్రంలో వివేకానంద విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి


లింగాల మండలం అప్పాయిపల్లిలో..


తెలకపల్లిలో నివాళులర్పిస్తున్న నాయకులు


ఉప్పునుంతలలో బహుమతులు అందజేస్తున్న డీఎస్పీ కృష్ణకిశోర్


కొల్లాపూర్‌లో..


వెల్దండలో..


అమ్రాబాద్‌లో..

సమావేశాన్ని బహిష్కరించిన సర్పంచ్‌లు


సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరిస్తున్న సర్పంచ్‌లు

పెద్దకొత్తపల్లి: ప్రభుత్వం గ్రామపంచాయతీ నిధులను ఇతర శాఖల్లోకి మళ్లిండాన్ని నిరసిస్తూ మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, సర్పంచ్‌లు మండల సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించి బయటికి వెళ్లిపోయారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీలు వెంకటయ్య, ప్రతాపరెడ్డి, రామచంద్రయ్యలు విద్యుత్ అధికారుల పనితీరు బాగలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు ఫోన్ చేసినప్పుడు విద్యుత్ అధికారులు స్పందించి సమాధానం చెప్పాలని సూచించారు. ఏఈ ప్రదీప్‌గౌడ్ మాట్లాడుతూ గ్రామాల్లో విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు కొత్త లైన్లు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు ప్రతిపాదనలు పంపామని సభ్యులకు తెలిపారు. మంజూరైన వెంటనే సమస్య పరిష్కరిస్తామన్నారు. సాతాపూర్ ఫీడర్ ఉన్న గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కల్గుతున్నదని, ప్రతి గ్రామానికి ఏబీస్విచ్‌ను ఏర్పాటు చేస్తే విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగదని ఎంపీపీ, ఎంపీటీసీలు కోరారు. వెనచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ 18 నుంచి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. వ్యవసాయ అధికారి రమేష్ మాట్లాడుతూ మండలంలో 1,600 మంది రైతులు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కోసం ఈకేవైసీ చేసుకోలేదని తెలిపారు. కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయాలని ఎంపీటీసీ రవికుమార్ సభ దృష్టికి తెచ్చారు. సమావేశంలో ఎంపీడీఓ కృష్ణయ్య, కొల్లాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కిషన్‌నాయక్, వైస్ ఎంపీపీ దీపిక, తహసీల్దార్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి అండగా ప్రభుత్వం

కల్వకుర్తిరూరల్: పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని, సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గోలి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. స్వప్నకు రూ.48వేలు, సంధ్యకు రూ.60వేలు, శిరీషకు రూ.31వేలు అందజేశారు. జిల్లెల, పెద్దాపూర్ గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్సీని శ్రీనివాస్‌రెడ్డి కోరారు.


చెక్కు అందిస్తున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి


క్రీడాసామగ్రి పంపిణీ చేస్తున్న డీఈఓ గోవిందరాజులు

కొల్లాపూర్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని డీఈఓ గోవిందరాజులు సూచించారు. గురువారం మండలంలోని మొలచింతలపల్లి గ్రామంలోని సీఏఆర్‌సీ సెంటర్‌లో గ్రామిక వికాసకేంద్రం, క్రై సంస్థల ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడాసామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమానికి డీఈఓతో పాటు బాలల సంక్షేమ కమిటీ జిల్లా చైర్మన్ ఎల్లేని లక్ష్మణ్‌రావులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు ప్రహరీ నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని, పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు చేపడతామని డీఈఓ వెల్లడించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజుయాదవ్, ఎస్‌వీకే సంస్థ కోఆర్డినేటర్ తిరుపాలు, ఆర్గనైజర్లు రేణుక, శోభ, కవిత, ఎస్ఎంసీ చైర్మన్ నర్సింహా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు


చారకొండలో ముగ్గులను పరిశీలిస్తున్న గువ్వల అమల


బిజినేపల్లిలో సంక్రాంతి వేడుకలు నిర్వహిస్తున్న విద్యార్థులు

చారకొండ: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జీబీఆర్ ట్రస్టు చైర్‌పర్సన్ గువ్వల అమల అన్నారు. సంక్రాంతి సందర్భంగా మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎంపీపీ నిర్మల ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆయా గ్రామాల నుంచి 120 మంది మహిళలు పాల్గొని ముగ్గులు వేశారు. గెలుపొందిన వారికి గువ్వల అమల బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ విజేందర్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ గుర్వయ్య గౌడ్, వెంకటయ్య యాదవ్, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తి: పట్టణంలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో గురువారం ఉత్సాహంగా సంక్రాంతి సంబురాలను నిర్వహించారు.

తాడూరు: మండల కేంద్రంలోని సిద్ధార్థ మెమోరియల్ పాఠశాల ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులతో ముగ్గుల పోటీలు నిర్వహించారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో సంక్రాంతి సంబురాలు ఘనంగా నిర్వహించారు.

ఉప్పునుంతల: మండల కేంద్రంలో గురువారం జీబీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో మహిళలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు సతీమణి అమల బహుమతులను అందజేశారు.

బిజినేపల్లి: మండల కేంద్రంలోని మాస్టర్ మైండ్ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబురాలను నిర్వహించారు. కార్యక్రమానికి మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నెల్లికంటి మహేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

తెలకపల్లి: మండల కేంద్రంలోని సిద్ధార్థ మోడల్ పాఠశాలలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత
కోడేరు: మండలంలోని బావాయిపల్లికి చెందిన ముగ్గురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు మంజూరు కావడంతో సర్పంచ్ కర్రెమ్మ గురువారం అందజేశారు. పాడేళ్ల రాంబాబు కూతురుకు రూ.24వేలు, విజయమ్మకు రూ.12వేలు, దేవరపాగ నాగయ్యకు రూ.19వేలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేశారు.

బాధితుడికి నష్ట పరిహారం
మన్ననూర్: పెద్దపులి దాడిలో పాడి ఆవు మృతిచెందిన సంఘటనలో వటువర్లపల్లికి చెందిన ఇమ్మడి కృష్ణయ్యకు అటవీశాఖ తరుపున ఏటీఆర్ ఫీల్డ్ డైరెక్టర్ శితిజా రూ.8వేలు నష్ట పరిహారంగా గురువారం అందజేశారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ రోహిత్‌రెడ్డి, ఎఫ్‌డీఓ విశాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థికసాయం
అచ్చంపేట రూరల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన పేద విద్యార్థి, దివ్యాంగుడు చీమర్ల వంశీకి క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, క్లాస్‌మేట్ క్లబ్ రాష్ట్ర ప్రతినిధి బృందం పరమేశ్వరప్రసాద్, గోపాల్‌నాయక్, మురళి, సాయిప్రసాద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

కోడేరు: మండల కేంద్రంలోని 2004–05 సంవత్సరంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివిన చందన భర్త తోట మల్లేష్ వారం రోజుల కిందట కిడ్నీ సమస్యతో బాధపడుతూ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు రూ.44వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మణెమ్మ, మహేష్, బాలరాజు, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం
చారకొండ: మండలంలోని జూపల్లిలో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం ఫౌండేషన్ సభ్యులు వర ప్రసాద్‌రెడ్డి, సత్యం, శ్రీరాములు, సర్పంచ్ మల్లీశ్వరి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్గనైజర్లు ప్రశాంత్, చరణ్, తిరుపతి తదితరులు ఉన్నారు.

జాతీయస్థాయి సైన్స్‌ఫేర్‌కు ఎంపిక
ఉప్పునుంతల: స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో 8వ తరగతి ఇంగ్లిష్ మీడియం చదువుతున్న విద్యార్థిని భవాని రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం హన్మంత్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం పాఠశాలలో హెచ్ఎం, ఉపాధ్యాయులు విద్యార్థి భవానితో పాటు గైడ్ టీచర్ సతీష్‌ను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు లక్ష్మారావు, శ్రీనివాసమూర్తి, అనురాధ, అనుసూయ, సత్యనారాయణ, చంద్రశేఖర్, కల్పన తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్ల పదజాల పరీక్ష
కొల్లాపూర్: క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం కొల్లాపూర్‌లోని యూపీఎస్, మోడల్ హైస్కూల్‌లో ఆంగ్ల పదజాల పరీక్షలు నిర్వహించారు. కొల్లాపూర్ డివిజన్ పరిధిలోని వివిధ మండలాలకు చెందిన విద్యార్థులు ఈ పరీక్షల్లో పాల్గొన్నారు.

తెలకపల్లి: మండలంలోని గౌరారం ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆంగ్లం, గణితశాస్త్రాల్లో ట్యాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం వివేకనంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ
పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోల్‌లో వైస్ ఎంపీపీ భీంరెడ్డి మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు హయాంలో చేపట్టిన అభివృద్ధిపై క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భీంరెడ్డి మాట్లాడుతూ జూపల్లి కృష్ణారావు మంత్రిగా ఉన్న సమయంలో కొల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో సమీరుద్దీన్, గోపాల్, శ్రీనివాసులు, కృష్ణయ్య పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు


వైద్యుడిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్


అచ్చంపేట రూరల్: వైద్య సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ ఉదయ్ కుమార్ హెచ్చరించారు. గురువారం అచ్చంపేట ప్రభుత్వ సివిల్ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. కొంతమంది వైద్యులు, సిబ్బంది ఎలాంటి సమాచారం లేకుండా గైర్హాజరు కావడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. గైర్హాజరైన వైద్యులు, సిబ్బందిపై పూర్తి నివేదికలను అందించాలని ఆర్డీఓ పాండునాయక్‌ను ఆదేశించారు. అనంతరం వివిధ వార్డులను పరిశీలించారు. విధుల పట్ల అంకితభావంతో ఉండాలని, పేదలకు వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపైనే ఉందన్నారు.

‘కంటివెలుగు’ను విజయవంతం చేయండి

తాడూరు: ప్రభుత్వం ఈనెల 18 నుంచి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి సంతోష్‌అభిరాం ఎంపీడీఓ గంగామోహన్‌ను కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో కంటి వెలుగు కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కంటి వెలుగు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శివలీల, వైద్యాధికారులు ఇస్మాయిల్, శివశంకర్, ఎంపీఓ లక్ష్మి పాల్గొన్నారు.

వెల్దండ: ప్రభుత్వ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు పథకాన్ని అధికారులు బాధ్యతగా నిర్వహించాలని ఎంపీపీ విజయ, జెడ్పీటీసీ విజితారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మోహన్‌లాల్ పాల్గొన్నారు.

చారకొండ: మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ భవనంలో కంటి వెలుగు కార్యక్రమంపై మండల స్థాయి సమావేశం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కంటి వెలుగు కార్యక్రమంపై అవగాహన కల్పించాలని ఎంపీపీ నిర్మల అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ విజేందర్ గౌడ్, ఎంపీడీఓ జయసుధ, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.


తాడూరులో చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న అధికారులు

ఉప్పునుంతల: మండలంలో ఈనెల 18 నుంచి ఫిబ్రవరి 4వరకు నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.

జెడ్పీ చైర్‌పర్సన్ ప్రత్యేక ప్రార్థనలు


ప్రార్థనలు నిర్వహిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి

బిజినేపల్లి: మండలంలోని వట్టెంలో గురువారం నిర్వహించిన వట్టెం ఊర్సు ఉత్సవాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి, ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మతాలకు అతీతంగా ఉత్సవాలను నిర్వహించుకోవడం వల్ల జాతీయ ఐక్యతకు ఆదర్శమని అన్నారు.

ఆదాయ పరిమితి జీఓ రద్దు చేయాలి
నాగర్‌కర్నూల్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఆసరా పింఛన్లకు ఆదాయ పరిమితి విధించే జీఓ 17ను రద్దు చేయాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కార్యదర్శి బాలీశ్వర్ డిమాండ్ చేశారు. గురువారం సమావేశంలో మాట్లాడారు. దివ్యాంగులకు పరికరాలు, రుణాలు, వివాహ ప్రోత్సాహకాలు, డబుల్‌బెడ్రూం ఇళ్లు అందించాలని విజ్ఞప్తి చేశారు.

దివ్యాంగుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడిగా మహేష్
వెల్దండ: మండలంలోని గుండాలకు చెందిన కొమ్ము మహేష్‌ను భారత దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. గురువారం రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ నియామకపత్రం అందజేశారు.

ఫొటోగ్రాఫర్ల సమస్యలు పరిష్కరిస్తాం: ఎమ్మెల్యే మర్రి

కందనూలు: ఫొటోగ్రాఫర్ల సమస్యలు పరిష్కరించేందుకు తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. గురువారం ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారాన్ని జిల్లాకేంద్రంలో నిర్వహించారు.

ఎల్ఓసీ అందజేత..

తెలకపల్లి: మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన ఊర మల్లేశ్‌కు మంజూరైన రూ.2లక్షల ఎల్ఓసీ లెటర్‌ను ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి అందజేశారు.

అనుమతి ఇవ్వొద్దు
కొల్లాపూర్: దేశంలో విదేశీ విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కేంద్రం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరికాదని బీఆర్ఎస్‌వీ నాయకుడు డి.శేఖర్ అన్నారు. గురువారం ఆయన స్థానిక కళాశాలల విద్యార్థులతో సమావేశమయ్యారు.

రాజనీతి శాస్త్రంలో పీహెచ్‌డీ పట్టా
బల్మూర్: మండల కేంద్రానికి చెందిన పడాల నందకిషోర్ ఉస్మానియా యూనివర్సిటీలో రాజనీతిశాస్త్రంలో పీహెచ్‌డీ పట్టా సాధించాడు. గురువారం హైదరాబాద్‌లోని యూనివర్సిటీలో రాజనీతిశాస్త్ర అధిపతి డాక్టర్ చందు, సీనియర్ ప్రొఫెసర్ పరిశోధన పర్యవేక్షకులు జాడి ముసలయ్య, బీఓఎస్ పర్సన్ డాక్టర్ శ్రీలతల చేతుల మీదుగా పట్టాను అందుకున్నారు.

■ గేమింగ్

దుష్టశక్తిని శక్తిహీనం చేయండి




త్వరలో విడుదల కాబోతున్న టాక్టికల్ రోల్ ప్లేయింగ్ గేమ్ ఫైర్ ఎంబ్లమ్ ఎంగేజ్. 'ఫైర్' సిరీస్‌లో భాగంగా వస్తున్న గేమ్ ఇది. ఎన్నో సంవత్సరాల తరువాత ఒక దుష్టశక్తి తిరిగి వస్తే? భయపడితే ప్రయోజనం లేదు, భయపెడితేనే ఫలితం దక్కుతుంది. ఈ ఆటలో ఉంగరాలే ప్రధాన ఆయుధాలు. వివిధ రకాల దాడులకు ఉపకరించే మహిమాన్విత ఉంగరాలు ఇవి. ఈ గేమ్‌కు సంబంధించిన మార్పు ఏమిటంటే ప్లేయర్స్ తమ బలగాలను డైరెక్ట్‌గా కంట్రోల్ చేయవచ్చు. 2019లో వచ్చిన 'ఫైర్ ఎంబ్లమ్: త్రీ హౌజెస్' పెద్ద సక్సెస్ అయింది. దీంతో తాజా ఆటపై అంచనాలు పెరిగాయి. విజువల్ నావెల్ స్టోరీ టెల్లింగ్‌తో ప్లేయర్స్‌ను పలకరించనున్న 'ఫైర్ ఎంబ్లమ్ ఎంగేజ్' ఆ అంచనాలను అందుకోవాలని ఆశిద్దాం.

మోడ్: సింగిల్-ప్లేయర్ వీడియో గేమ్ **జానర్స్:** టాక్టికల్ రోల్ ప్లేయింగ్ గేమ్
ప్లాట్‌ఫామ్: నిన్‌టెండో స్విచ్

■ టెక్... టాక్

ఇన్‌స్టాలో ఇలా...



ఇన్‌స్టాగ్రామ్ ఎకౌంట్ నుంచి డిలీట్ చేసిన కంటెంట్‌ను రీస్టోర్ చేసుకోవడానికి...

* ఇన్‌స్టా ఓపెన్ చేసిన తరువాత ప్రొఫైల్‌పై ట్యాప్ చేయాలి.
* టాప్‌రైట్‌లోని 'మోర్ ఆప్షన్స్' ట్యాప్ చేయాలి.
* యాక్టివిటీ కంట్రోల్స్-ట్యాప్
* రీసెంట్ డిలీటెడ్-ట్యాప్
* టాప్‌లోని టైప్ ఆఫ్ కంటెంట్ (రీస్టోర్-ప్రొఫైల్ పోస్ట్,రీల్స్, వీడియోస్, స్టోరీస్) సెలెక్ట్ చేసుకోవాలి
* రీస్టోర్ చేయాలనుకున్నదానిపై ట్యాప్ చేయాలి.
* టాప్ రైట్‌లోని మోర్ ఆప్షన్-ట్యాప్
* రీస్టోర్ టు ప్రొఫైల్ లేదా రీస్టోర్ టు రీస్టోర్ కంటెంట్ ట్యాప్ చేయాలి.

వాట్సాప్‌లో కెప్ట్ మెసేజ్ ఫీచర్




ఇన్‌స్టంట్ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సాప్ 'కెప్ట్ మెసేజ్' అనే కొత్త ఫీచర్‌ని పరీక్షిస్తోంది. దీనితో డిజపీయరింగ్ మెసేజ్‌లను సేవ్ చేయవచ్చు. చాట్‌లకు సంబంధించి మరింత కంట్రోల్‌కు యూజర్‌లకు ఉపకరించే ఫీచర్ ఇది. 2021లో స్నాప్‌చాట్... మొదలైన వాటి స్ఫూర్తితో వాట్సాప్ 'డిజప్పియరింగ్ మెసేజ్' ఫీచర్‌ను ప్రవేశ పెట్టింది. ఎవరికైనా మెసేజ్ పంపినప్పుడు నిర్ణీతమైన కాలవ్యవధి తరువాత మెసేజ్ దానికదే డిలీట్ అయిపోతుంది. మళ్లీ దాన్ని చూడడం కుదరదు. అయితే 'కెప్ట్ మెసేజ్' టూల్ డిజప్పియరింగ్ చాట్‌లో కూడా మెసేజ్‌లను ప్రిజర్వ్ చేస్తుంది.

■ సక్సెస్ స్టోరీ

క్లిక్ కింగ్

పదమూడు సంవత్సరాల వయసులోనే కెమెరాతో స్నేహం మొదలుపెట్టిన ప్రణయ్‌కి, ఇప్పుడు ఆ కెమెరానే ప్రాణం. అరణ్యానికి సంబంధించిన అద్భుతదృశ్యాలను అమితంగా ఇష్టపడే ప్రణయ్ వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్‌గా అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకున్నాడు. ఇంకా ఎన్నో అద్భుతాలు సాధించడానికి ఉత్సాహంగా ఉన్నాడు.....


ప్రణయ్ పటేల్

పదమూడు సంవత్సరాల వయసులో కెమెరాతో అనుబంధం పెంచుకున్నాడు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన ప్రణయ్ పటేల్. అది ఆ వయసుకు మాత్రమే పరిమితమైన ఉత్సాహమై ఉంటే వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్‌గా ప్రణయ్ అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకునేవాడు కాదు.

దేశవిదేశాల్లో అరణ్యానికి సంబంధించిన ఎన్నో అద్భుతమైన దృశ్యాలను ఫొటోలలో బంధించాడు. ఈ చిత్రాలు జాతీయ,అంతర్జాతీయ క్యాలెండర్‌లను అలంకరించాయి. అడవిలో ఫొటోగ్రఫీ అనేది అంతా వీజీ కాదు.

'మేము రెడీ. ఇక మీరు ఫొటో తీసుకోవచ్చు' అన్నట్లుగా ఉండదు అక్కడ. ఏ క్షణంలో ఏ అద్భుతం ఆవిష్కారం అవుతుందో తెలియదు. ఒళ్లంతా కెమెరా కన్నులై ఉండాలి. అడవి నాడి తెలిసిన ప్రణయ్‌కి ఈ విషయం తెలియనిదేమీ కాదు. అందుకే అడవిలోని అద్భుతదృశ్యాలను సమర్థవంతంగా పట్టుకోగలిగాడు.

'లొకేషన్‌లోకి ప్రవేశించిన వెంటనే బ్యాక్ ప్యాక్ ఓపెన్ చేసి కెమెరా సెట్ చేసుకోవాలి. బోర్ కొట్టవచ్చు. అలసటగా అనిపించవచ్చు. అయితే మన లక్ష్యం...అద్భుత దృశ్యం అనే విషయాన్ని మరవకూడదు. ఓపికతో కూడిన నిరీక్షణ నన్ను ఎప్పుడూ నిరాశ పరచలేదు' అంటాడు ప్రణయ్.

దేశవిదేశాల్లో అరణ్యానికి సంబంధించిన ఎన్నో అద్భుతమైన దృశ్యాలను ఫొటోలలో బంధించాడు ప్రణయ్. ఈ చిత్రాలు జాతీయ, అంతర్జాతీయ క్యాలెండర్‌లను అలంకరించాయి.

ప్రణయ్ ఫొటోలతో రూపుదిద్దుకున్న 'ది వండర్‌ఫుల్ వైల్డ్‌లైఫ్ ఆఫ్ గుజరాత్' 'ది బేర్స్ ఆఫ్ కమ్‌చట్క-రష్యా' 'ది వైల్డ్ ఎర్త్ ఆఫ్ ఆఫ్రికా'... మొదలైన క్యాలెండర్‌లకు ఎంతో పేరు వచ్చింది. గుజరాత్ టూరిజం కార్పొరేషన్ అధికారిక ఫొటోగ్రాఫర్‌గా చిన్న వయసులోనే నియమించబడ్డాడు.

'ఫొటోగ్రాఫర్‌కు దృశ్యజ్ఞానమే కాదు శబ్దజ్ఞానం కూడా ఉండాలి' అంటున్న ప్రణయ్ శబ్దాల ద్వారా కూడా దృశ్యాలను ఊహించగలడు. వాటిని అందంగా ఛాయాచిత్రాలలోకి తీసుకురాగలడు.

తన వెబ్‌సైట్ ద్వారా ఎంతో మంది ఔత్సాహిక ఫొటోగ్రాఫర్‌లకు స్ఫూర్తిని, ఉత్సాహాన్ని ఇస్తున్న ప్రణయ్ అమెరికాతో సహా ఎన్నో దేశాల్లో జరిగిన ఫొటోఎగ్జిబిషన్‌లలో పాల్గొన్నాడు.

'వర్తమానం నుంచే కాదు గతం నుంచి కూడా ఎన్నో అద్భుత విషయాలను నేర్చుకోవచ్చు' అంటున్న ప్రణయ్ అలనాటి బ్లాక్ అండ్ వైట్ ఫొటోలలోని అద్భుతాలను ఆసక్తిగా విశ్లేషిస్తుంటాడు.

'ప్రతి ఫొటో ఒక కొత్త విషయాన్ని మనకు పరిచయం చేస్తుంది' అంటాడు ప్రణయ్.

స్కూల్‌బ్యాగ్ మోసుకెళ్లాల్సిన వయసులో కెమెరా బ్యాగు మోసుకెళుతున్న ప్రణయ్‌కి వెక్కిరింపులు ఎదురయ్యాయి. 'ఇక నీకు చదువు ఏం వస్తుంది!' అని ముఖం మీదే అన్నవాళ్లు కూడా ఉన్నారు.

అయితే ఆ మాటలు విని తాను ఎప్పుడూ బాధపడలేదు. వెనక్కి తగ్గలేదు. కెమెరాతో స్నేహం వీడలేదు. దేశవిదేశాలలో ప్రణయ్ చేసిన ఫొటోగ్రఫీ టూర్‌లు వంద దాటాయి.

'ప్రతి టూర్‌కు సంబంధించిన అనుభవాలను ఒక పుస్తకంగా రాసుకోవచ్చు' అని మురిసిపోతుంటాడు ప్రణయ్.

'కెమెరా పట్టుకోగానే అద్భుతాలు చోటుచేసుకోవు. పర్‌ఫెక్ట్ షాట్ కోసం రోజులే కాదు సంవత్సరం పాటు ఎదురుచూసిన సందర్భాలు కూడా ఉన్నాయి' అంటాడు ప్రణయ్. ఫొటోగ్రఫీ గురించి ఓనమాలు తెలియని వారే కాదు, ఆ విద్యలో కొమ్ములు తిరిగిన ఫొటోగ్రాఫర్‌లు కూడా ప్రణయ్‌ని ప్రశంసలతో ముంచెత్తున్నారు.

25 సంవత్సరాల ప్రణయ్ పటేల్ భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆశిద్దాం.

■ పెద్ద పండగ

పండగపూట పల్లెటూర్

● మీది పల్లెటూరు అయితే ఫరవాలేదు, నగరవాసులు అయితే మాత్రం ఈ మూడు రోజుల పండగలో ఒకరోజు పల్లె' టూర్'కు కేటాయించండి. ఎందుకంటే ఇది రైతుల పండగ. పంటల పండగ. పచ్చదనాల పండగ. పొలాల దగ్గరికి వెళ్లి ఆ గాలిని ఆస్వాదించండి. రైతులతో మాట్లాడితే ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు.



● పండగపూట కాస్త కొత్తగా కనిపించాలని ఎవరికి మాత్రం ఉండదు? దీని కోసం పండగరోజు పంచె,కండువా ధరించండి. ఎంత బాగున్నారో కదా!

●గాలిపటాలు ఎగిరేసే ముందు పక్షుల గురించి ఒక్కసారి ఆలోచించండి.

■ ఇంగ్లీష్ ఇడియమ్స్

కింగ్ ఆఫ్ ది హిల్



ఒక వ్యక్తి సమర్థతకు సంబంధించి ఏకాభిప్రాయంతో చెప్పే మాట....కింగ్ ఆఫ్ ది హిల్. ఫలాన ఆటలో ఫలానా వ్యక్తి ఛాంపియన్, ఫలానా రంగంలో ఫలానా వ్యక్తికి తిరుగులేని సామర్థ్యం ఉంది....ఇలాంటి సందర్భాల్లో ఉపయోగిస్తారు. ఇంగ్లాండ్‌లోని పిల్లల ఆటల్లో నుంచి పుట్టిన మాట ఇది. ఆటలో భాగంగా పిల్లవాడు ఒక ఎత్తయిన చోట కూర్చొని, తనను తాను రాజుగా ప్రకటించుకొని 'ఐయామ్ ది కింగ్ ఆఫ్ కాజిల్ అండ్ యూ ఆర్ డర్టీ' అని పాట అందుకుంటాడు. ఇతడిని కిందికి దించడానికి మిగతా పిల్లలు ప్రయత్నిస్తుంటారు.

■ గ్యాడ్జెట్ బజార్

డిజో స్మార్ట్ వాచ్

డిజో వాచ్ డి ప్రో, వాచ్ డి అల్ట్రా స్మార్ట్‌వాచ్‌లను మన దేశంలో విడుదల చేసింది. వీటికి సంబంధించిన కొన్ని వివరాలు..



డి ప్రో

స్క్రీన్: 1.85 అంగుళాలు **రిఫ్రెష్ రేట్:** 60 హెచ్‌జడ్ **పవర్:** డిజో డీపి చిప్
మోడ్స్: 110 స్పోర్ట్స్ మోడ్స్
కలర్ ఆప్షన్స్: క్లాసిక్ బ్లాక్, సిల్వర్ గ్రే, లైటెనింగ్ బ్లూ **ధర:** ₹ 2,699

డి అల్ట్రా

స్క్రీన్: 1.78 అంగుళాలు **బ్యాటరీ:** 270 ఎంఏహెచ్ **రిజల్యూషన్:** 368×448 పిక్సెల్స్ **బ్యాటరీ:** 270 ఎంఏహెచ్ **మోడ్స్:** 100 ప్లస్ స్పోర్ట్స్ మోడ్స్ (ఇండోర్-ఔట్‌డోర్) **కలర్స్:** క్లాసిక్ బ్లాక్, సిల్వర్ గ్రే, ఒషన్ బ్లూ.

లెనోవా ట్యాబ్ పీ11 ప్రో జెన్2



రిజల్యూషన్: 1536×2560 పిక్సెల్స్ **బ్యాటరీ:** 8000 ఎంఏహెచ్
వోఎస్/సాఫ్ట్‌వేర్: ఆండ్రాయిడ్ 12
● ఫింగర్‌ప్రింట్ సెన్సర్
మెమొరీ: 128 జీబి 4జీబి ర్యామ్ 128జీబి 6జీబి ర్యామ్ 256జీబి 8జీబి ర్యామ్

ప్రేమికుల దినోత్సవానికి టైటానిక్


● కేట్ విన్స్‌లెట్, లియోనార్డో

సినిమా లవర్స్‌కి.. అందులోనూ ప్రేమకథా చిత్రాల ప్రేమికులకు ఈ ప్రేమికుల దినోత్సవానికి సిల్వర్ స్క్రీన్‌పై 'టైటానిక్' ప్రత్యక్షం కానుంది. టైటానిక్ ఓడలో పరిచయం అయి, ప్రేమికులుగా దగ్గరయ్యే జాక్, రోజ్‌లు చివరికి ఓడ ప్రమాదంలో దూరమయ్యే ఈ విషాదభరిత ప్రేమకథ ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను అలరించింది. ప్రేమికులుగా లియోనార్డో డికాప్రియో, కేట్ విన్స్‌లెట్‌ల కెమిస్ట్రీని అంత సులువుగా ఎవరూ మరచిపోలేరు. జేమ్స్ కామెరూన్ తెరకెక్కించిన ఈ ఎవర్‌గ్రీన్ లవ్‌స్టోరీ విడుదలై 25 ఏళ్లయింది. ఈ సిల్వర్ జూబ్లీ సందర్భంగా ఈ చిత్రాన్ని హై క్వాలిటీతో మళ్లీ సిల్వర్ స్క్రీన్‌పైకి తీసుకు రావాలనుకుంటున్నారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా ప్రకటించి పోస్టర్‌ని, ట్రైలర్‌ని విడుదల చేసింది చిత్ర నిర్మాణ సంస్థల్లో ఒకటైన ట్వంటీయత్ సెంచురీ ఫాక్స్. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా వచ్చే నెల 10న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. 4కే ప్రింట్‌తో త్రీడీ వెర్షన్‌లో ఈ లవ్‌స్టోరీ కొత్త హంగులతో రావడానికి సిద్ధమవుతోంది. ఇక 1997 నవంబర్‌లో విడుదలైన 'టైటానిక్' సంచలన విజయం సాధించిన విషయం తెలిసిందే. ప్రపంచ వ్యాప్తంగా రూ. 13 వేల కోట్లకు పైగా కలెక్ట్ చేసి, రికార్డు సృష్టించింది. 2010లో జేమ్స్ కామెరూన్ అద్భుత సృష్టి 'అవతార్' విడుదలయ్యే వరకూ అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రం రికార్డ్ 'టైటానిక్'దే. కామెరూన్ తన సినిమా రికార్డ్‌ని తానే బద్దలు కొట్టడం విశేషం. ఇక ఆస్కార్ అవార్డ్స్‌లో 14 నామినేషన్లు దక్కించుకుని, 11 అవార్డులను సొంతం చేసుకున్న ఘనత కూడా 'టైటానిక్'కి ఉంది. ప్రేక్షకుల ఆదరణతో పాటు ఇలా పలు రికార్డులు సొంతం చేసుకున్న ఈ చిత్రం త్రీడీ వెర్షన్‌ని 2012లో విడుదల చేశారు. ఇప్పుడు మరింత క్వాలిటీతో 'టైటానిక్' రానుంది.

ఇన్నాళ్లకు మళ్లీ కన్నీళ్లు వచ్చాయి

- 'దిల్' రాజు


● జయసుధ, వంశీ పైడిపల్లి, 'దిల్' రాజు, శ్రీకాంత్

''వారిసు' చిత్రంపై తమిళ ప్రేక్షకులు చూపిన స్పందనకి వంశీ పైడిపల్లి, తమన్ ఏడ్చారు. 'బొమ్మరిల్లు' సినిమా చూస్తున్నప్పుడు వచ్చిన ఒక ఫోన్ కాల్‌తో నేను కూడా ఏడ్చాను.. మళ్లీ ఇన్నాళ్లకు 'వారిసు' చూస్తున్నపుడు కన్నీళ్లు వచ్చాయి. మా నమ్మకం నిజం కావడంతో వచ్చిన ఆనందభాష్పాలు అవి'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. దళపతి విజయ్, రష్మికా మందన్న జంటగా వంశీ పైడిపల్లి దర్శకత్వంలో తెరకెక్కిన ద్విభాషా చిత్రం 'వారిసు' (తమిళ్), 'వారసుడు' (తెలుగు). 'దిల్' రాజు, శిరీష్, పరమ్ వి. పొట్లూరి, పెరల్ వి. పొట్లూరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న తమిళ్‌లో విడుదలైంది. తెలుగులో 14న 'వారసుడు' విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో 'దిల్' రాజు మాట్లడుతూ- ''చెన్నైలో 'వారిసు' ఆడుతున్న థియేటర్‌కి వెళ్లాను.. క్లైమాక్స్ పూర్తయ్యాక వంశీని అభిమానంతో హత్తుకున్నాను. ప్రేక్షకులు నిలబడి క్లాప్స్ కొట్టడంతో మేం పడ్డ కష్టాలు మర్చిపోయాం'' అన్నారు. వంశీ పైడిపల్లి మాట్లాడుతూ- ''ఒక మంచి కథని చెబితే ప్రేక్షకులు ఎంత గొప్పగా ఆదరిస్తారో 'వారిసు' మరోసారి నిరూపించింది. సినిమా అయిపోయిన తర్వాత ప్రేక్షకులు చప్పట్లు కొట్టారు. అల్లు అరవింద్‌గారు ఫోన్ చేసి 'వెయ్యి కోట్లు పెట్టినా రాని అనుభూతి ఇది' అని అభినందించారు'' అన్నారు. ''తమిళంలోలా తెలుగులోనూ ఈ సినిమా ఘనవిజయం సాధిస్తుంది'' అన్నారు నటి జయసుధ.


● రవిశంకర్, గోపీచంద్, బాలకృష్ణ, తమన్, నవీన్

ఆ సన్నివేశాలు కంటతడి పెట్టిస్తున్నాయి

- బాలకృష్ణ

''సంక్రాంతికి విందు భోజనంలాంటి సినిమా 'వీరసింహారెడ్డి'. ప్రేక్షకులు, ఫ్యాన్స్.. ఇలా అందరి నుండి అద్భుతమైన ఆదరణ వస్తోంది'' అన్నారు బాలకృష్ణ. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో బాలకృష్ణ, శ్రుతీహాసన్ జంటగా నటించిన చిత్రం 'వీరసింహారెడ్డి'. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా గురువారం విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన వీర మాస్ బ్లాక్ బస్టర్ సక్సెస్ మీట్‌లో బాలకృష్ణ మాట్లాడుతూ- ''అఖండ'లాంటి హిట్ తర్వాత అలాంటి మరో సినిమాని ప్రేక్షకులు ఆశిస్తారు. అందుకు తగ్గట్టే నా అభిమాని అయిన గోపీచంద్ 'వీరసింహారెడ్డి'ని అద్భుతంగా తీశాడు. ఈ చిత్రంలో నాకు-వరలక్ష్మికి మధ్య వచ్చే అన్నా చెల్లెలి సన్నివేశాలు మహిళలనే కాదు మగవాళ్లనూ కంటతడి పెట్టిస్తున్నాయి'' అన్నారు. ''నా కెరీర్‌లో ఇది బ్లాక్ బస్టర్' అన్నారు గోపీచంద్. ''మా సినిమా తొలి రోజే 50 కోట్ల గ్రాస్ దాటుతోంది. ఇది పెద్ద రికార్డ్. బాలకృష్ణగారి మైలురాయి చిత్రానికి మేం నిర్మాతలు కావడం హ్యాపీ'' అన్నారు నిర్మాతలు.

అదరగొట్టావ్ అబ్బాయ్ అన్నారు

- దేవిశ్రీ ప్రసాద్



''వాల్తేరు వీరయ్య'లో 'పూనకాలు లోడింగ్..' పాటలో బూరలాంటి వాయిద్యం ఉపయోగించి ఆ ట్యూన్‌ని కంపోజ్ చేశాను. అది చిరంజీవి గారికి నచ్చడంతో 'అదర గొట్టావ్ అబ్బాయ్' అన్నారు. నేను కంపోజ్ చేసిన ట్యూన్ ఒక ఎత్తు అయితే ఆయన డ్యాన్స్‌తో పాటని మరో స్థాయికి తీసుకెళ్లారు'' అని సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ అన్నారు. చిరంజీవి, శ్రుతీహాసన్ జంటగా హీరో రవితేజ కీలక పాత్రలో బాబీ కొల్లి (కేఎస్ రవీంద్ర) దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వాల్తేరు వీరయ్య'. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా నేడు రిలీజవుతోంది. ఈ సందర్భంగా దేవిశ్రీ ప్రసాద్ చెప్పిన విశేషాలు.

● చిరంజీవిగారి 'వాల్తేరు వీరయ్య', బాలకృష్ణగారి 'వీరసింహారెడ్డి' చిత్రాలు నిర్మించింది మా మైత్రీ మూవీస్ నిర్మాతలే (నవీన్ యెర్నేని, వై. రవిశంకర్). రెండు సినిమాలూ మావే కావడం, సంక్రాంతికి విడుదలవడం చాలా గర్వంగా ఉంది. సంగీతం విషయంలో ఎలాంటి ఒత్తిడి లేదు. ఏ సినిమాకైనా కథ ప్రకారమే మ్యూజిక్ చేస్తాం.. రెండు సినిమాలూ అద్భుతంగా ఆడాలి.

● బాబీతో నాకు చాలా అనుబంధం ఉంది. 'వాల్తేరు వీరయ్య'లో అన్ని పాటలూ హిట్ కావడానికి కారణం బాబీ కథ, ఆయన నాపై పెట్టుకున్న నమ్మకం. అన్నిటికీ మించి చిరంజీవిగారు మా ఇద్దరిపై పెట్టుకున్న నమ్మకం. చిరంజీవిగారితో సినిమా చేయాలనే బాబీ కల ఈ చిత్రంతో నెరవేరడం ఆనందంగా ఉంది. ఈ సినిమా చూసి చిరంజీవిగారితో 'నవ్విస్తూ ఏడిపించారు.. ఏడిపిస్తూ నవ్వించారు' అని అన్నాను. ఆయన 'ఎంత బాగా చెప్పావ్ మై బాయ్' అన్నారు.

● ఈ సినిమాలో రవితేజ, చిరంజీవిగారి సీన్స్‌కి క్లాప్స్ మామూలుగా ఉండవు. కంటతడితో, నవ్వుతూ క్లాప్స్ కొట్టే సీన్స్ చాలా ఉంటాయి. బాస్‌ని (చిరంజీవి) మనం ఎలా అయితే చూస్తూ పెరిగామో.. ఆ ఎలిమెంట్స్‌తో పాటు కొన్ని కొత్త ఎలిమెంట్స్ కూడా ఉన్నాయి. కామెడీ, డ్యాన్స్, ఫైట్స్.. అన్నీ కుమ్మేశారు. బాస్‌ని చాలా రోజుల తర్వాత పక్కా మాస్ ఎంటర్‌టైనర్‌లో చూస్తున్నాం.. ఎక్కడా తగ్గకూడదని ప్రతి పాట విషయంలో జాగ్రత్తలు తీసుకున్నా.

● ప్రతి సినిమా సవాల్‌గానే ఉంటుంది. కానీ, ఒత్తిడిగా భావించకుండా సరదాగా చేస్తాను. నేను బాస్‌ని చూస్తూ పెరిగాను.. ఆయన్ని చూడగానే ఒక ఎనర్జీ వచ్చేస్తుంది. ఇందులో 'నువ్వు శ్రీదేవి..' పాటకి ఆయన స్క్రీన్‌పై ఎలా చేస్తారో ముందే ఊహించి, కంపోజ్ చేసి బాబీకి చూపించా.. అలాగే 'పూనకాలు లోడింగ్..' పాటలో చిరంజీవి, రవితేజగార్లు కనిపిస్తే ఎంత సందడిగా ఉంటుందో ఆ ఎనర్జీ అంతా పాటలో ఇచ్చేశాం.

క్రైమ్.. థ్రిల్

ఓ యువకుడిని క్రిమినల్ కేసులో పోలీసులు అరెస్ట్ చేస్తారు. అతన్ని విడిపించడానికి ఓ క్రిమినల్ లాయర్ కేసును టేకప్ చేస్తుంది. గురువారం హీరో రామ్‌చరణ్ విడుదల చేసిన 'అహింస' ట్రైలర్‌లో కనిపించిన సన్నివేశాలు ఇవి. మరోవైపు అదే ట్రైలర్‌లో ఆ యువకుడు, ఓ యువతి ప్రేమలో ఉన్న సీన్లు కనబడతాయి. దివంగత ప్రముఖ నిర్మాత డి. రామానాయుడు మనవడు, నిర్మాత సురేష్‌బాబు తనయుడు అభిరామ్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'అహింస'. గీతిక హీరోయిన్‌గా లాయర్ పాత్రలో సదా నటించిన ఈ చిత్రానికి తేజ దర్శకుడు. ఈ క్రైమ్ థ్రిల్లర్ మూవీకి పి. కిరణ్ నిర్మాత. త్వరలో రిలీజ్ కానున్న ఈ చిత్రానికి సంగీతం: ఆర్పీ పట్నాయక్, కెమెరా: సమీర్ రెడ్డి.


● అభిరామ్

రియల్ లైఫ్ పాత్రలు గుర్తొస్తాయి

- దేవీ ప్రసాద్


● ప్రియా, సంతోష్, అనిల్, దేవీ ప్రసాద్

''బాలకృష్ణ, చిరంజీవిగార్ల సినిమాలతో (వీరసింహారెడ్డి, వాల్తేరు వీరయ్య) సంక్రాంతికి మళ్లీ ఒక కళ వచ్చింది. ఆ చిత్రాలతో పాటు మా సినిమా వస్తుండటం అదృష్టంగా భావిస్తున్నాం'' అని సంతోష్ శోభన్ అన్నారు. అనిల్ కుమార్ ఆళ్ల దర్శకత్వంలో సంతోష్ శోభన్, ప్రియా భవానీ శంకర్ నటించిన చిత్రం 'కళ్యాణం కమనీయం'. యూవీ కాన్సెప్ట్స్ సంస్థ నిర్మించిన ఈ సినిమా రేపు రిలీజవుతోంది. ఈ సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో సంతోష్ మాట్లాడుతూ- ''నాకు వెన్నుదన్నుగా ఉంటున్న నిర్మాతలు వంశీ, విక్కీ, అజయ్ అన్నలకు థ్యాంక్స్. ప్రియ నటన, కార్తీక్ సినిమాటోగ్రఫీ, శ్రవణ్ భరద్వాజ్ సంగీతం ఈ సినిమాకి ప్లస్'' అన్నారు. ''జీవితంలో నేర్చుకోవాల్సిన చాలా పాఠాలు 'కళ్యాణం కమనీయం'లో ఉన్నాయి. ఒక నిజాయితీ కథ, కథనాలతో చేసిన మూవీ ఇది'' అన్నారు అనిల్ కుమార్ ఆళ్ల. ''తెలుగులో నాకిది మొదటి సినిమా'' అన్నారు ప్రియా భవానీ శంకర్. ''ఈ సినిమా చూశాక ప్రేక్షకులకు వాళ్ల రియల్ లైఫ్‌లోని పాత్రలు, కొన్ని ఘటనలు గుర్తొస్తాయి'' అన్నారు దేవీ ప్రసాద్.

దేశం కోసం...


● రవీంద్ర

దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన సమరయోధుల చరిత్ర ఆధారంగా రూపొందిన చిత్రం 'దేశం కోసం భగత్ సింగ్'. గతంలో 'అన్నల రాజ్యం, నాగమనాయుడు, రాఘవేంద్ర మహత్యం' వంటి చిత్రాలను నిర్మించిన రవీంద్ర గోపాల ఈ చిత్రాన్ని స్వీయదర్శకత్వంలో నిర్మించారు. దేశభక్తి నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రంలో రవీంద్ర గోపాల, రాఘవ, మనోహర్ ప్రధాన పాత్రల్లో నటించారు. త్వరలో రిలీజ్ కానున్న ఈ చిత్రానికి సంగీతం: ప్రమోద్ కుమార్, కెమెరా: సీవీ ఆనంద్.